

# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి B.A.LL.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 12-07-2022 సంపుటి : 03 సంచిక : 287 పేజీలు : 4 వెల : రూ 3-00

# పవన్‌కల్యాణ్‌ది వీకెండ్ ప్రజాసేవ: పేర్ని నాని



తాడేపల్లి: ప్లీనరీలో కార్యకర్తలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. జోరువానలో తడిసి ముద్దవుతున్నా కూడా కార్యకర్తలు ప్లీనరీలో పాల్గొన్నారన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడుతూ మేనిఫెస్టోలో 95 శాతం హామీలను అమలు చేసిన ప్రభుత్వం మాదని.. చెప్పిన హామీలనే కాదు.. చెప్పనివి కూడా సీఎం జగన్ అమలు చేశారన్నారు.చదవండి: 'విమర్శలు చేస్తారు.. చర్చకు రమ్మంటే పారిపోతారు..'విద్య, వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. విశ్వసనీయత, విలువలకు నిలువుటద్దంలా సీఎం జగన్ పాలన ఉందన్నారు. పవన్ కల్యాణ్‌ది వీకెండ్ ప్రజాసేవ అంటూ పేర్ని నాని ఎద్దేవా చేశారు. 'పక్షానికో సారి సెలవు రోజున పవన్‌కల్యాణ్ ప్రజాసేవ.. పవన్.. షూటింగ్‌లకే కాదు.. రాజకీయాల్లోనూ ఆలస్యమే. పవన్ అసెంబ్లీ గేటు ముట్టుకోవటమనేది ప్రజలు నిర్ణయిస్తారు" అని పేర్ని నాని అన్నారు. 2024లో జగన్‌ను అధికారంలోకి తెచ్చుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్ని నాని స్పష్టం చేశారు.శాశ్వత అధ్యక్షుడు అనే పద్ధతి భారత దేశంలో ఎక్కడా లేదా?, ఇలాంటి తీర్మానం టీడీపీ లో పెడితే బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఊరుకోరు కాబట్టి గమ్మునున్నారు. వెన్నుపోటు పొడిచి పార్టీ లాక్కున్న నీకు సాధ్యం కాదు కాబట్టి ఏదో అంటున్నారు. మా పార్టీ మా ఇష్టం...మీకెంటి అభ్యంతరం. సాక్షాత్తు ఈ దేశ ప్రధాని స్వయంగా ఫోన్ చేసి ఎన్డీఏ రాష్ట్రపతి అభ్యర్థి ముర్మును బలపరచాలని కోరారు. అమిత్ షా కూడా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఫోన్ చేసి మద్దతు కోరారు. ప్రధాని కార్యాలయం నుంచి మద్దతుగా సంతకం చేయాలి రమ్మని సీఎం వైఎస్ జగన్ రమ్మని కోరారు. మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి సంతకాలు చేసి మద్దతు పలికారు. వేము అంటరానివాళ్ళమైతే రేపు ముర్మూ గారు ఎందుకు వస్తున్నారు. ఆ మాటలు మాట్లాడిన సత్యకుమార్ కి నిజంగా సత్తా ఉంటే రేపు ఆమెను రాకుండా చేయండి. స్థాయి,శక్తికి మించి మాట్లాడితే భంగ పాటు తప్ప ఏమీ ఉండదు' అని పేర్ని నాని స్పష్టం చేశారు.

# గృహ నిర్మాణంపై సీఎం జగన్ సమీక్ష..



అమరావతి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న గృహ నిర్మాణాలకు వనరుల విషయంలో దృష్టిసారించాలని, నాణ్యత విషయంలో రాజీపడొద్దని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏపీలో గృహనిర్మాణశాఖపై తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో ఇవాళ(సోమవారం) సీఎం జగన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా.. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనుల ప్రగతిపై సీఎం జగన్ ఆరా తీశారు.ఈ సందర్భంగా అధికారులు.. ఇంకా ఎక్కడైనా అవసరాలు ఉంటే దానికి అనుగుణంగా పనులు, నిధులు మంజూరుచేసి పని పూర్తిచేస్తున్నామని అధికారులు బదులిచ్చారు. అంతేకాదు గత సమీక్ష సందర్భంగా ఇచ్చిన ఆదేశాల మేరకు.. ఇంకా అవసరమైన చోట ల్యాండ్ లెవలింగ్, ఫిల్లింగ్, అంతర్గత రోడ్లు, గోడౌన్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తిచేస్తున్నామని తెలిపిన అధికారులు. ఆప్షన్ ?3లో ఇళ్ల నిర్మాణం వేగంగా జరుగుతోందని అధికారులు సీఎం జగన్‌కు వివరించారు. ఆప్షన్ ?3 కింద ఎంపిక చేసుకున్న వారి ఇళ్ల నిర్మాణాన్ని సత్వరమే పూర్తిచేయడానికి

### వనరులపై దృష్టిసారించాలని ఆదేశం

నిర్దేశించుకున్న ఎస్ఓపీని పాటించాలని అధికారులను ఆదేశించారు సీఎం జగన్. అంతేకాదు.. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన వనరులన్నీ కాలనీల్లో ఉన్నాయా? లేదా? ఇటుకల తయారీ యూనిట్లను కాలనీలకు సమీపంలోనే పెట్టుకున్నారా? లేదా? తదితర వనరుల విషయంలో పరిశీలనలు చేయాలని తెలిపారు.అలాగే గోడౌన్లు తదితర కనీస అవసరాలను సమకూర్చుకుని.. ఇళ్లనిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ నెలాఖరులోగా కోర్టు కేసుల వివాదాల్లోని ఇళ్లపట్టాలపై స్పష్టత కోసం ప్రయత్నించాలని, ఆగస్టు మొదటివారంలో ప్రత్యామ్నాయ ప్రణాళికతో సిద్ధంకావాలని ఆదేశాలు జారీ చేశారు. ఇంకా.. జగనన్న కాలనీల్లో డ్రెయిన్లు సహా కనీస మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి: డ్రైనేజీ, కరెంటు, నీటి సరఫరా అంశాలపై దృష్టిపెట్టాలి. ఇళ్లలో పెట్టే ఫ్యాన్లు, బల్బులు, ట్యూబ్‌లైట్లు నాణ్యతతో ఉండాలి. జగనన్న కాలనీల రూపంలో కొన్నిచోట్ల ఏకంగా మున్సిపాల్టీలే తయారవుతున్నాయి. అలాంటి చోట్ల మౌలిక సదుపాయాల కల్పన, పౌరసేవలు తదితర అంశాలపై ప్రత్యేక ప్రణాళిక ఉండాలి. నిర్మాణ నాణ్యతపై అధికారులు ప్రతి దశలోనూ దృష్టిపెట్టాలి:90 రోజుల్లో పట్టాలు పంపిణీపై కూడా సీఎం సమీక్ష లబ్ధిదారునికి కేవలం ఎక్కడ ఇంటి స్థలం ఇచ్చిందీ చూపడమే కాదు, పట్టా, దానికి సంబంధించిన డాక్యుమెంట్ల అన్నీకూడా ఇవ్వాలి. స్థలం ఇచ్చారని, దానికి సంబంధించిన పట్టా, డాక్యుమెంట్లు కూడా ఇచ్చారని లబ్ధిదారుల నుంచి ధృవీకరణ తీసుకోవాలని అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షా సమావేశంలో రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, ఏపీఎస్‌హెచ్‌సీఎల్ ఛైర్మన్ దవులూరి దొరబాబు, సీఎస్ సమీర్ శర్మ, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై శ్రీలక్ష్మి, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ జి సాయి ప్రసాద్, గృహనిర్మాణశాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ ఏపీఎస్‌హెచ్‌సీఎల్ ఎండీ నారాయణ భరత్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏపీ సీఎం జగన్ విశాఖ పర్యటన ఖరారు

తాడేపల్లి: ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఈ మేరకు సీఎంఓ అధికారులు జగన్ పర్యటనను ధ్రువీకరించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 13 బుధవారం ఆయన విశాఖలో పర్యటిస్తారు. ఈ సందర్భంగా వాహనమిత్ర లబ్దిదారులతో సమావేశమై వారికి చెక్కులను పంపిణీ చేయనున్నారు.గన్నవరం విమానాశ్రయం నుంచి ఈ నెల 13 న ఉదయం 10 గంటలకు బయల్దేరనున్న సీఎం జగన్.. 10.30 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 11.05 గంటలకు ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న సమావేశమండపానికి వస్తారు. అక్కడ వాహనమిత్ర లబ్దిదారులతో ముఖాముఖి సమావేశం ఫొటో సెషన్ ఉంటుంది.అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తారు. ఆ తర్వాత అక్కడి బహిరంగ సభలో జగన్ ప్రసంగిస్తారు. సమావేశంలో లబ్దిదారులకు చెక్కులు అందజేస్తారు. తిరిగి మధ్యాహ్నం 12.30 గంటలకు విశాఖ విమానాశ్రయంలో పార్టీ నేతలతో సమావేశమవుతారు.

# ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రమాణం



అమరావతి : కర్నూలు జిల్లా ఆత్మకూరు ఉప ఎన్నికల్లో అధికార పార్టీ వైసీపీ ఎమ్మెల్యేగా విజయం సాధించిన మేకపాటి విక్రమ్‌రెడ్డి ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు. ఛాంబర్‌లో ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మేకపాటిని శాలువాతో సన్మానించారు. మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్‌తో పాటు వైసీపీ నాయకులు మేకపాటికి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సోదరుడు గౌతమ్ ఆశయాలను నెరవేరుస్తానన్నారు. గెలిపించిన ఆత్మకూరు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఏపీ మంత్రిగా పనిచేసిన మేకపాటి గౌతంరెడ్డి గుండెపోటుతో మరణించడంతో ఖాళీ అయిన ఆత్మకూరు స్థానానికి ఎన్నికల సంఘం ఉప ఎన్నికను నిర్వహించింది. ఈ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగి విక్రంరెడ్డి పోటీచేయగా ప్రధాన ప్రత్యర్థిగా బీజేపీ అభ్యర్థి పోటీ చేశారు. ఉప ఎన్నికల్లో మేకపాటి విక్రమ్ రెడ్డి 82,888 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు.

# కిమ్‌ను మించిపోయిన జగన్ : నారా లోకేశ్

అమరావతి : ఏపీలో వైసీపీ శాశ్వత అధ్యక్షుడిగా జగన్‌ను ప్రకటించడంపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ వ్యంగ్యంగా విమర్శలు చేశారు. తనను తానే శాశ్వత అధ్యక్షుడుగా ప్రకటించుకోవడంపై ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌ను జగన్ మించిపోయాడని ఆరోపించారు. టీడీపీ ఎమ్మెల్యే పీఏసీ చైర్మన్ పయ్యావుల కేశవ్‌కు భద్రతను తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ డేటా చోరీ, ఫోన్ ట్యాపింగ్



గుట్టురట్టు చేశారనే కోపంతో కేశవ్ కు భద్రతను తొలగించారని పేర్కొన్నారు.తనకు అదనపు భద్రత కావాలని ప్రభుత్వాన్ని కోరితే ఉన్న సెక్యూరిటీని తొలగించి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. తక్షణమే కేశవ్‌కు అదనపు గన్‌మెన్లను కేటాయించి సెక్యూరిటీని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కాగా కేశవ్‌కు భద్రతను తొలగించామని వస్తున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని జిల్లా ఎస్పీ వెల్లడించారు.అతడికి వన్ ప్లస్ వన్ గన్‌మెన్లు కొనసాగుతారని వివరించారు.

# ఉద్ధవ్ థాక్రే వర్గానికి మరోసారి చుక్కెదురు!

### 'మహా' స్పీకర్‌కు సుప్రీం కోర్టు కీలక సూచన

న్యూఢిల్లీ: శివసేన ఉద్ధవ్ థాక్రే వర్గానికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. సీఎం ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వ ఏర్పాటుకు వ్యతిరేకంగా థాక్రే వర్గం దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించేందుకు అత్యున్నత ధర్మాసనం నిరాకరించింది. అంతేకాదు ఈ పిటిషన్‌పై విచారణ జరిగేవరకు షిండే వర్గంలోని 16 మంది రెబల్ ఎమ్మెల్యేల అనర్హత విషయంపై ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని న్యాయస్థానం మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌కు సూచించింది.పార్టీపై తిరుగుబావుటా ఎగురవేసిన 16 మంది ఎమ్మెల్యేల అనర్హత వేటుపై ఎటూ తేలకముందే మహారాష్ట్రలో నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు గవర్నర్ షిండేను ఆహ్వానించారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని థాక్రే వర్గం గతవారం సుప్రీంను ఆశ్రయించింది. ఈ 16 మంది బలపరీక్షతో పాటు స్పీకర్ ఎన్నిక ఓటింగ్‌లోనూ పాల్గొన్నారని పేర్కొంది. వారి అనర్హత వేటు విషయంపై సుప్రీంకోర్టే తీర్పు చెప్పాలని కోరింది. అయితే ఈ పిటిషన్‌పై సోమవారమే విచారణ జరుగుతుందని థాక్రే వర్గం భావించింది. కానీ లిస్టింగ్‌లో ఇది కన్పించలేదు. దీంతో పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ చేపట్టాలని థాక్రే వర్గం కోరింది. అయితే దీన్ని రాజ్యాంగ ధర్మాసనం పరిశీలించాల్సి ఉందని, కొంత సమయం పడుతుందని కోర్టు తెలిపింది. ఆ తర్వాతే విచారణ చేపడతామని చెప్పింది. మంగళవారం కూడా థాక్రే పిటిషన్‌పై విచారణ జరిగే సూచనలు కన్పించడం లేదు.



# పెట్టుబడులు, పరిశ్రమల స్థాపనను ప్రోత్సహిస్తున్నాం : మంత్రి కేటీఆర్




సంగారెడ్డి : పటాన్ చెరు మండల పరిధిలోని పాశమైలారం పారిశ్రామికవాడలో అల్ప్లా ఇండియా పరిశ్రమలో వరల్డ్‌క్లాస్ మౌల్డ్ యూనిట్‌ను, డ్యూయల్ ఎడ్యుకేషన్ సెంటర్‌ను ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ ఇవాళ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలపై, పెట్టుబడిదారులపై ఎలాంటి ఒత్తిడి లేదని కేటీఆర్ పేర్కొన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ ద్వారా పెట్టుబడులు, పరిశ్రమల స్థాపనను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో స్థిరమైన, సామర్థ్యం ఉన్న ప్రభుత్వం వల్ల జాతీయ సగటు కంటే రాష్ట్ర సగటు అధికంగా ఉందన్నారు. తెలంగాణలో సమ్మిళిత అభివృద్ధి జరగాలని ఉద్దేశంతో ముందుకు సాగుతున్నాం. దిగుమతులు తగ్గించి.. స్థానికంగానే ఉత్పత్తి పెంచి.. స్థానిక యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని కేటీఆర్ స్పష్టం చేశారు.టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణలో ఐదు విప్లవాలు వచ్చాయన్నారు. సశ్య విప్లవంతో లక్షల ఎకరాల సాగులోకి వచ్చాయి. దేశంలోనే అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. నీలి విప్లవంతో మన దేశ అవసరాలతో పాటు విదేశాలకు ఎగుమతి చేసే స్థాయిలో చేపల ఉత్పత్తి ఉందని కేటీఆర్ తెలిపారు. క్షీర విప్లవంతో రాష్ట్రంలో పాల ఉత్పత్తి పెరిగింది. రాష్ట్రం ఏర్పడే నాటికి అప్పులతో మూతపడే దశలో ఉన్న విజయా డైరీ.. నేడు ప్రభుత్వానికి డివిడెంట్ ఇచ్చే స్థాయికి ఎదిగిందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో గులాబీ విప్లవంతో మాంసం ఉత్పత్తి కూడా పెరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. పసుపు విప్లవంతో రాష్ట్రంలో నూనె గింజల ఉత్పత్తి పెరగనుందన్నారు. వచ్చే ఐదేండ్లలో 25లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యంగా పెట్టుకున్నామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# దక్షిణ మధ్య రైల్వే పరిధిలో పది రైళ్ల రద్దు

హైదరాబాద్ జూలై 11 భారీ వర్షాల నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వేపరిధిలో పది రైళ్ల రద్దు అయ్యాయి. మరో రెండు రైళ్లు పాక్షికంగా రద్దు అయ్యాయి. సికింద్రాబాద్– ఉందనగర్– సికింద్రాబాద్ ప్యాసింజర్ స్పెషల్, సికింద్రాబాద్– ఉందానగర్ మెము సర్వీస్, మేడ్చల్ – ఉందానగర్, ఉందానగర్ – సికింద్రాబాద్ స్పెషల్, సికింద్రాబాద్ – ఉందనగర్ – సికింద్రాబాద్ స్పెషల్, నాందేడ్– మేడ్చల్– నాందేడ్ స్పెషల్, సికింద్రాబాద్ – మేడ్చల్, మేడ్చల్ – సికింద్రాబాద్, కాకినాడ– విశాఖపట్నం– కాకినాడ పోర్టు మెము, విజయవాడ – బిట్రగుంట – విజయవాడ మధ్య రైళ్లు రద్దు అయ్యాయి. ఎంఎంటీఎస్ రైళ్లు రద్దు...మరోవైపు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో హైదరాబాద్‌లో ఎంఎంటీఎస్ సర్వీసులకు అంతరాయం ఏర్పడింది.



# సంపాదకీయం

మంగళవారం 12-07-2022

## వానలే.. వానలు

వర్షాలే వర్షాలు.. మామూలు వర్షాలు కావు. ఆకాశానికి చిల్లుపడినట్లు కురుస్తున్నాయి ఈ వానలు. వారం రోజుల నుంచి దంచి కొడుతున్నాయి. దీంతో వాగులు వంకలు పొంగుతున్నాయి. అన్ని నదుల్లోకి వరదనీరు పోటెత్తడంతో.. ప్రాజెక్టులు కూడా క్రమంగా నిండుతున్నాయి. తెలంగాణలో గోదావరితోపాటు.. మిగిలిన చిన్న నదుల్లోనూ నీటి పొంగు కనిపిస్తోంది. భారీ వరదల కారణంగా తెలంగాణ ప్రభుత్వం ప్రజలను అప్రమత్తం చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా రెడ్ అలర్ట్ ప్రకటించింది. రాత్రి, రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, హైదరాబాద్ వాసులు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సీపీ ఆనంద్ సూచించారు. పోలీసులు హైదరాబాద్‌లోని రోడ్లపై ఉండి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కడెం ప్రాజెక్టుకు భారీ వరద పోటెత్తింది. 4 గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో 49వేల క్యూసెక్కులు ఉంటే.. ఔట్‌ఫ్లో 20వేల క్యూసెక్కులున్నాయి. పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులుగా ఉంటే.. ఇప్పుడు నీటిమట్టం 692.1 అడుగులకు చేరింది. అటు గడ్డెన్న వాగు కూడా ఉగ్రరూపం దాల్చడంతో.. రిజర్వాయర్ గేట్లు ఎత్తారు. ఇక హైదరాబాద్ చుట్టుపక్కల భారీగా కురిసిన వర్షాలకు జంట జలాశయాలు కళకళలాడుతున్నాయి. ఉస్మాన్‌సాగర్‌కు వరద పోటు పెరిగింది. ఇన్‌ఫ్లో 100 క్యూసెక్కులు ఉంది. పూర్తిస్థాయి నీటిమట్టం 1790 అడుగులు ఉంటే.. ప్రస్తుత నీటిమట్టం 1785.80 అడుగులుగా ఉంది. ఇక హిమాయత్‌సాగర్ ప్రాజెక్టులోనూ భారీగా వరదనీరు చేరుతోంది. పూర్తిస్థాయి నీటిమట్టం 1763.50 అడుగులకు.. 1760.30 అడుగుల వరకు నీరు చేరింది. ఇక మూసీ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మూసీ ప్రాజెక్టుకు వరద భారీగా వస్తోంది. ప్రాజెక్టుకు సంబంధించిన నాలుగు గేట్లను ఎత్తి నీటిని కృష్ణానదిలోకి వదులుతున్నారు. ఇన్‌ఫ్లో 2200 క్యూసెక్కులు.. ఔట్‌ఫ్లో 4300 క్యూసెక్కులుగా ఉంది. కృష్ణా నదిలో నీటి ప్రవాహం పెరుగుతోంది. తెలంగాణ, ఏపీలో కురిసిన వర్షాలతో ప్రకాశం బ్యారేజీకి వరద పెరిగింది. దీంతో 30 గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. ముద్రంలోకి 18వేల250 క్యూసెక్కులు, కాలువల్లోకి 4వేల948 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తం ఇన్ ఫ్లో 23వేల198 క్యూసెక్కులుగా ఉంది. ఇక తుంగభద్రలోనూ వరద ప్రవాహం భారీగా ఉంది. తుంగభద్ర ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 89వేల357 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 312 క్యూసెక్కులుగా ఉంది. పూర్తిస్థాయి నీటినిల్వ 100.85 టీఎంసీలకు ప్రస్తుతం నీటినిల్వ 80 టీఎంసీలకు చేరింది. గోదావరి నదికి పోటెత్తిన వరద విషయానికి వద్దాం. కర్నాటక, మహారాష్ట్ర, తెలంగాణలో కురిసిన వర్షానికి నదిలో భారీగా నీటి ప్రవాహం కనిపిస్తోంది. నిజామాబాద్ జిల్లాలో ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. ఇన్‌ఫ్లో 4లక్షల 83వేల క్యూసెక్కులుగా ఉంది. పూర్తి స్థాయి నీటి మట్టం 1091 అడుగులకు గాను.. ప్రస్తుతం 1084అడుగులకు నీరు చేరింది. ప్రాజెక్టు ఔట్ ఫ్లో 10 వేల క్యూసెక్కులుగా ఉంది. ఇక గోదావరి నదిపై ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు వరద ప్రభావం తీవ్రంగా ఉంది. మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ ఇన్ ఫ్లో 8లక్షల 66వేల క్యూసెక్‌లు ఉండడంతో.. ప్రాజెక్టుకు ఉన్న 75 గేట్లను పూర్తిస్థాయిలో ఎత్తి.. అదే స్థాయిలో నీటిని వదులుతున్నారు. బ్యారేజీ దిగువ ప్రాంతాల వారికి ప్రమాదం పొంచి ఉండడంతో.. అధికారులు హై అలర్ట్ ప్రకటించారుఈ ప్రభావం అటు భద్రాచలంలోనూ కనిపిస్తోంది. ఇక్కడ గోదావరి నీటిమట్టం 32 అడుగులకు చేరింది. దాదాపు 5 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం నమోదవుతోంది. రాత్రికి 43 అడుగులకు చేరుకోనుంది గోదావరి నీటిమట్టం. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. మరోవైపు తాలిపేరు ప్రాజెక్టు నీటి మట్టం పెరుగుతోంది. పూర్తిస్థాయి నీటిమట్టం 74 అడుగులకు..ప్రస్తుతం 70 అడుగులకు చేరింది. గోదావరికి వరద పోటు పెరుగుతుండడంతో.. ఏలూరు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఇక పోలవరం ప్రాజెక్ట్ స్పిల్ వే 48 గేట్లు ఎత్తారు అధికారులు. ప్రస్తుతం స్పిల్ వే దగ్గర 28 మీటర్ల నీటిమట్టం ఉంది. దీంతో ధవళేశ్వరం బ్యారేజీకి వరద పెరిగింది. దాదాపు లక్షా 20వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కిన్నెరసాని ప్రాజెక్టు 4 గేట్లు ఎత్తేశారు. రాజాపురం దగ్గర వాగు ఉధృతి భారీగా ఉంది. 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇక జంపన్నవాగు పొంగింది. దీంతో రహదారులపైకి నీరు చేరుతోంది


## గ్రావెల్ తవ్వకాలపై వైసీపీలో వర్గపోరు

నెల్లూరు, జూలై 11, పెన్నా నది పరివాహక ప్రాంతం కావడంతో నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గంలో భూములకు డిమాండ్ ఎక్కువ. నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాలెం.. కొడవలూరు.. కోవూరు.. విడవలూరు మండలాల్లో గ్రావెలతోపాటు ఇసుక అధికంగా లభిస్తుంది. ఇవే స్థానిక వైసీపీ నేతలకు కాసులు కురిపిస్తున్నాయి. ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం సైతం ప్రస్తుతం చర్చగా మారింది. అధికారపార్టీ వర్గాల్లోనే కుమ్ములాటలకు.. వర్గపోరుకు.. కేడర్‌కు ఎమ్మెల్యేకు మధ్య దూరం పెరగడానికి కారణమైందని చెబుతున్నారు. కోవూరు నియోజకవర్గంలోని మండలాలకు పార్టీ నేతలను ఇంఛార్జులుగా నియమించారు ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డి. వారికే పూర్తి బాధ్యతలు అప్పగించారు. దాంతో ఆ నాయకులు ప్రతి విషయంలో జోక్యం చేసుకుంటూ సమస్యలు సృష్టిస్తున్నారని పార్టీలోనే విమర్శలు ఉన్నాయి. మూడేళ్లుగా ఇదే జరుగుతున్నా ఎమ్మెల్యే లైట్ తీసుకుంటున్నారట. కొడవలూరులో ఆఅటూ అధ్యక్షుడు చలపతిరావు చెప్పిందే వేదంగా మారిపోయిందట. అక్కడేం జరగాలన్నా చలపతిరావు అనుమతి కావాలని పార్టీ వర్గాలే చెబుతున్నాయి. ఇటీవల మండలంలో గ్రావెల్ తవ్వకాలపై వైసీపీలో వర్గపోరు మొదలైంది. సమస్య ఎమ్మెల్యే దృష్టికి వెళ్లింది. అన్నీ విన్న ప్రసన్నకుమార్‌రెడ్డి ఏదీ పట్టించుకోలేదట. విడవలూరు మండలంలో వైసీపీ నేతల మధ్య పంపకాల్లో తేడాలు వచ్చాయట. ఎమ్మెల్యే పేరు చెప్పి కొందరు డబ్బులు వసూలు చేశారని గుప్పుమంది. ఆ సంఘటనపై మాత్రం ప్రసన్న కుమార్‌రెడ్డి భగ్గుమన్నారు. ఇందుకూరుపేట మండలంలో పార్టీ నేతలు శ్రీనివాసరెడ్డి, ఆదిశేషారెడ్డిలపై మరో నేత సురేష్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. నేతల అవినీతి చిట్టా బయటపెడతానని సురేష్‌రెడ్డి చెప్పడంతో కలకలం రేగింది. కొందరు నాయకులైతే.. జనాల్లో డ్యామేజీ అవుతోందని భావించి.. నేరుగా ఎమ్మెల్యే దగ్గర పంచాయితీ పెట్టారట. పార్టీలో వారైనా ఉండాలి లేదాంటే మేమైనా వెళ్లిపోతామని తెగేసి చెప్పారట. బుచ్చిరెడ్డిపాలెం మండలంలో వైసీపీ నేత సూరా శ్రీనివాసరెడ్డి సర్వం తానై వ్యవహరిస్తున్నారట. ఇక్కడ ఇసుక, గ్రావెల్ తవ్వకాలపై నిత్యం తగువే. కొందరు కోట్లు గడించారని పార్టీ వర్గాలే ఆరోపిస్తున్నాయి. పైగా వైసీపీకి మొదటి నుంచి పనిచేస్తున్న వారిని కాదని.. కొత్తగా వచ్చిన వారికి ఎలా పెత్తనం ఇస్తారని ప్రశ్నిస్తున్నారట. అయితే ఎమ్మెల్యేకు స్నేహితుడిగా ఉన్న తనను ఎవరూ ఏమీ చేయలేరని ఒక నాయకుడు చేస్తున్న ప్రకటనలు కేడర్‌ను దిక్కతోచని స్థితిలో పడేస్తున్నాయి. ఈ మండలంలో జరుగుతున్న వ్యవహారాలను కొందరు వైసీపీ నేతలు సీఎం జగన్‌కు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఇక కోవూరు మండలంలోనూ ఇదే పరిస్థితి ఉందట. అక్కడా వాటల కోసం పార్టీ నేతలు గొడవలు పడుతున్నారు. మొత్తానికి ఒక్కో మండలాన్ని ఒక్కో నేతకు అప్పగించి.. ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఏదీ పట్టించుకోవడం లేదనే వైసీపీ కేడర్ గుర్రుగా ఉంది. తనకు కావాల్సిన వాళ్లకు మండలాలు రాసిచ్చేసి.. అక్రమార్జనకు లైసెన్స్ ఇచ్చారని పార్టీ నేతలే వాపోతున్నారు. సొంత పార్టీ వాళ్లకే మామూళ్లు ఇచ్చుకోవాల్సి వస్తోందని కేడర్ గగ్గోలు పెడుతోంది. అన్నీ తెలిసిన ఎమ్మెల్యే ఎందుకు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారో పార్టీ శ్రేణులకు అర్థం కావడం లేదట.

## మాజీ మంత్రిగారి జోక్యంపై ఫిర్యాదులు

అనంతపురం, జూలై 11 అధికారులు బదిలీపై వెళ్తే.. లోకల్‌గా ఉన్న ఎమ్మెల్యే, కలెక్టర్, లేదా మంత్రిని మర్యాదపూర్వకంగా కలవడం ఆనవాయితీ. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో మాత్రం పూర్తి డిఫరెంట్. ఇక్కడికి ఎవరొచ్చినా.. ఏం జరగాలన్నా ముందుగా ఎమ్మెల్యే సోదరులను కలవాలట. ఇక్కడ ఎమ్మెల్యే మొన్నటి వరకు మంత్రిగా చేసిన శంకర నారాయణ. తొలిసారి శాసనసభ్యుడిగా గెలిచినా.. 2019లోనే కేబినెట్‌లో చోటు కొట్టేశారు. ఇందుకు సామాజికవర్గం సమీకరణాలు కలిసొచ్చాయి. శంకర నారాయణ ఎమ్మెల్యే కాకముందు వైసీపీ జిల్లా అధ్యక్షుడు కూడా. ఆ సమయంలో పెద్దగా చర్చల్లో ఉండేవారు కాదు శంకర నారాయణ. కానీ.. మంత్రి అయ్యాక వివాదాలు గట్టిగానే ముసురుకున్నాయి. సొంత పార్టీవాళ్లే ఆయనపై తిరుగుబాటు చేసేంతగా పరిణామాలు మారిపోయాయి. తాడేపల్లి వరకు ఫిర్యాదులు వెళ్లాయి. ఇక్కడో సంగతి ప్రత్యేకంగా చెప్పుకొంటాయి పార్టీ వర్గాలు. పెనుకొండలోని వైసీపీ నేతలు, కార్యకర్తల కోపం శంకర నారాయణపై కాదట. ఆగ్రహం అంతా ఆయన సోదరులపై అని ఓపెన్‌గానే చెబుతారు. మాజీ మంత్రికి ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. ఒకరు రవి.. ఇంకొకరు మల్లికార్జున్. శంకర నారాయణ మంత్రిగా ఉన్న సమయంలో ఫుల్ బిజీ. ఆ టైమ్‌లో పెనుకొండలో పెత్తనం ఆయన సోదరులదే. వారిలో రవి మరీ దూకుడుగా వెళ్లేవారట. కేవలం రాజకీయ కార్యకలాపాలకే కాకుండా.. అధికారికంగా శంకర నారాయణ చేయాల్సిన పనుల్లోనూ జోక్యం చేసుకునేవారట తమ్ముళం వారు. ఆ విధంగా నియోజకవర్గంలో మొత్తం పట్టు సాధించారని టాక్. పెనుకొండలో చీమ చిటుక్కుమన్నా.. ఏ పని జరగాలన్నా శంకర నారాయణ సోదరులకు తెలియాల్సిందేనట. ఈ వైఖరి కొత్తలో బాగానే ఉన్నా.. రాన్రానూ శ్రుతిమించినట్టు చెబుతున్నారు. ఫలితంగా వైసీపీ లోకల్ లీడర్సే ఎదురు తిరిగే పరిస్థితి వచ్చింది. శంకర నారాయణ మంత్రిగా ఉన్నంతకాలం ఉగ్గబెట్టుకుని ఉన్న అసంతృప్తి నేతలు.. ఆయన కేబినెట్‌లో చోటు కోల్పోగానే బయటకొచ్చారు. ఆయన వ్యతిరేకులంతా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దగ్గరకు వెళ్లి ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు రాకపోవడంతో అది నివురు గప్పిన నిప్పులా మారిపోయింది. తాజాగా ఒక ఉద్యోగిని విషయంలో మాజీ మంత్రి సోదరులు వ్యవహరించిన తీరు చర్చగా మారింది. పెనుకొండ ఓఖఆూ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన ఒక ఉద్యోగిని బదిలీపై పరిగి మండలానికి వచ్చారు. జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వబోతుంటే.. అక్కడి ఎంపీడీవో షాక్ ఇచ్చారట. ముందుగా వెళ్లి శంకర నారాయణ సోదరుల పర్మిషన్ తీసుకోవాలని.. ఆ తర్వాత డ్యూటీలో చేరాలని సెలవిచ్చారట. ఇక్కడ ఇంకో గమ్మత్తుఉంది. ఆ మహిళా ఉద్యోగి భర్త వైసీపీ నాయకుడు. ఆయనశంకర నారాయణ వ్యతిరేకవర్గం కావడంతోనే అలా చేశారని నియోజవర్గంలో గుప్పుమంది. ఆ వర్గపోరు కారణంగా ఆ ఉద్యోగినికి అక్కడ పోస్టింగ్ క్యాన్సిల్ చేసి మడకశిర పంపేశారట. పెనుకొండలో ఇలాంటి ఘటనలు చాలానే ఉన్నాయన్నది వైసీపీ అసంతృప్తులు చెప్పేమాట. శంకర నారాయణ ఇద్దరు సోదరుల్లో రవి వైఖరిపైనే పార్టీ వర్గాలకు ఎక్కువ అభ్యంతరాలు ఉన్నాయట. ఆయన లక్ష్యంగానే సోషల్ మీడియాలో ఏకి పడేస్తున్నట్టు టాక్. తమ్ముడు. ఇదంతా తెలిసినా మాజీ మంత్రి శంకర నారాయణ ఎందుకు మౌనంగా ఉన్నారన్నదే కేడర్‌కు అర్థం కావడం లేదట.

## విశాఖలో కో-ఆర్డినేటర్లకు గడ్డుకాలం



విశాఖపట్నం, జులై 11, (న్యూస్ పల్స్) విశాఖ జిల్లా వైసీపీలో కో-ఆర్డినేటర్లకు గడ్డుకాలం నడుస్తోంది. పశ్చిమ, దక్షిణ స్థానాల్లో ఇంఛార్జుల పంచాయితీ చల్లారక ముందే.. తాజాగా తూర్పు నియోజకవర్గంలో తిరుగుబాటుకు చాప కింద నీరులా ప్రయత్నాలు ప్రారంభం అయ్యాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో అధికారపార్టీకి తూర్పు నియోజకవర్గం చాలా కీలకం. ఇక్కడ వరసగా మూడుసార్లు టీడీపీ గెలిచింది. 2019 ఎన్నికల్లోనే సిట్టింగ్ ఎమ్మెల్యేకు చెక్ పెట్టేందుకు వైసీపీ వ్యూహం రచించినా వర్కవుట్ కాలేదు. ఇప్పుడు అక్కడి టీడీపీలో అంతర్గత బలహీనతలు బయటపడి పరిస్థితిని మార్చేస్తున్నాయి. దీనిని గుర్తించిన వైసీపీ.. వచ్చే ఎన్నికల్లో పక్కాగా పోరాటం చేసేందుకు కొత్త వ్యూహం రచించింది. తూర్పు నియోజకవర్గంలో బలమైన సామాజికవర్గాలుగా ముద్రపడ్డ యాదవులు, మత్స్యకారులకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన అక్కరమాని విజయనిర్మలకు కోఆర్డినేటర్ బాధ్యతలతోపాటు విశాఖపట్నం మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్‌పర్సన్ పదవి అప్పగించింది. ఇదేస్థానం నుంచి రెండుసార్లు ఓడిన వంశీకృష్ణ శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీని చేసింది. అలాగే విశాఖ మేయర్ పదవిని గొలగాని హరి వెంకట కుమారికి కట్టెబట్టింది. ఈ విధంగా బలమైన బీసీ యాదవ సామాజికవర్గానికి గాలం వేసింది అధికారపార్టీ. కానీ క్షేత్రస్థాయిలో సీన్ మారిపోయిందట. కోఆర్డినేటర్‌గా అక్కరమాని విజయనిర్మల వర్గం ఒంటెద్దుపోకడలు పోతుందనే వాదన చినికి చినికి గాలివానగా మారుతోంది. పార్టీలో సీనియర్లకు గుర్తింపు ఇవ్వడం లేదనే అసహనం ముదిరి? ఆమెకు వ్యతిరేకంగా సమావేశాలు పెట్టే వరకు వెళ్లిందట. నియోజకవర్గ పరిధిలో జీవీఎంసీ 15 డివిజన్లు ఉండగా.. 11 చోట్ల వైసీపీ గెలిచింది. వీరిలో 10 మంది కార్పొరేటర్లు అక్కరమానిపై అసంతృప్తితో ఉన్నారట. ఈ ముసలం వెనక అసలు కారణం వచ్చే ఎన్నికల్లో తూర్పు టికెట్ కోసమే అనేది టాక్. గత ఎన్నికల్లో భీమిలికి చెందిన అక్కరమాని కుటుంబానికి తూర్పులో టికెట్ ఇచ్చింది వైసీపీ. వంశీకృష్ణ శ్రీనివాస్ టికెట్ ఆశించినా.. నిరాశే మిగిలింది. అప్పటి నుంచే అక్కమానికి.. వంశీకృష్ణకు విభేదాలు మొదలైనట్టు చెబుతారు. తూర్పు నియోజకవర్గంలో అక్కరమాని, వంశీకృష్ణ వర్గాల మధ్య అస్సలు పడటం లేదు. దానికితోడు కొద్దిరోజుల క్రితం పార్టీ ఆఫీసులో జరిగిన మీటింగ్‌లో ఎమ్మెల్సీ వంశీకృష్ణ తన మనసులోని మాటను చెప్పేశారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయబోతున్నట్టు తెలిపారాయన. అయితే మేయర్ హరికుమారి భర్త శ్రీనివాస్ సైతం రేస్‌లో ఉన్నట్టు సంకేతాలు ఇవ్వడంతో రాజకీయం రసకందాయంలో పడింది. ఈ పరిణామాలు అక్కరమాని శిబిరానికి మింగుడు పడటం లేదట. ఇటీవల చేపట్టిన వార్డు అధ్యక్షుల నియామకాల్లో సిఫారసులను ఆమె పక్కన పెట్టేశారట. తమకు అనుకూలంగా ఉన్నవారికే పట్టం కట్టారట. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి దిగజారుతోందని.. మొదటి నుంచి వైసీపీలో పని చేస్తున్నవారికి కాకుండా..కొత్తవారినిప్రోత్సహిస్తున్నారనిఅసంతృప్తి స్వరాలు పెరుగుతున్నాయి. త్వరలోనే పార్టీ పెద్దలను కలిసి కోఆర్డినేటర్‌ను మార్చాలని కోరబోతున్నారట.


## పశ్చిమలో భారీ మార్పులు, చేర్పులు

ఏలూరు జూలై 11, ఏలూరు జిల్లాలో అధికార వైసీపీలో ఈ సారి భారీ మార్పులు, చేర్పులు తప్పేలా లేవు. జగన్ ఎలాగూ30 మంది నుంచి40 మంది వరకూ సిట్టింగ్‌లను పక్కన పెట్టేస్తున్నట్టు సొంత పార్టీ నేతలకే చెపుతున్నారు. మిగిలిన జిల్లాల సంగతి ఎలా ఉన్నా ఏలూరు జిల్లాలో ఉన్న 8 ( 7 పూర్తి సెగ్మెంట్లు, 1 సెగ్మెంట్ పాక్షికంగా) సీట్లలో మెజార్టీ సిట్టింగ్‌లు అవుట్ కానున్నారు. ఆ అవుట్ అయ్యే సిట్టింగ్ ప్లేసుల్లో కొత్త పేర్లు కూడా తెరమీదకు వచ్చేశాయి. అవుట్ అయ్యే ఎమ్మెల్యేల్లో చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్. ఎలీజా, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఫస్ట్ లిస్టులోనే ఉన్నట్టు పార్టీ హైకమాండ్ వర్గాల్లోనే చర్చ నడుస్తోంది. ఎలీజా విషయానికి వస్తే ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ సొంత నియోజకవర్గానికి ఆయన ఎమ్మెల్యే. ఇది శ్రీధర్‌కు కంచుకోట. ఆయన వర్గం బలంగా ఉండడంతోనే ఎన్నికలకు కొద్ది నెలల ముందే ఇక్కడకు వచ్చినా ఎలీజా నియోజకవర్గ చరిత్రలోనే లేని విధంగా 36 వేల ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. అయితే గెలిచిన యేడాదిన్నర నుంచే బలంగా ఉన్న ఎంపీ, ఆయన అనుచరగణంతో ఎలీజా ఢీ అంటే ఢీ అంటున్నారు. వాస్తవంగా చెప్పుకోవాలంటే నియోజకవర్గంలో మూడొంతులకు పైగా ఉన్న ప్రజాప్రతినిధులు, 80 శాతం మంది కీలక నాయకులు ఎలీజాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న పరిస్థితే ఉంది. వచ్చే ఎన్నికల్లో ఆయనకు సీటు ఇస్తే చేసే పరిస్థితి లేదని ఖరాఖండీగానే చెప్పేస్తున్నారు. ఎలీజాకు ఎంపీతో గొడవ వద్దని సమన్వయంతో ఉండాలని అధిష్టానం చెపుతున్నా ఆ మాటను పెడచెవిన పెట్టేస్తున్నారు. ఇక విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఎలీజాకు ఈ సారి టిక్కెట్ రాకుండా ఎంపీ వర్గం చేసిన ప్రయత్నాలు సక్సెస్ అయ్యాయి. చింతలపూడి వైసీపీ టిక్కెట్ రేసులో ప్రభుత్వ అధికారి కంభపు విజయరాజు ముందు ఉన్నారు. పైగా చింతలపూడి టిక్కెట్‌ను వైసీపీ మాల వర్గానికే ఇవ్వాలని చూస్తుండడం.. విజయరాజు ఆ వర్గానికి చెందిన వ్యక్తే కావడం.. ఇటు శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు ఆయనకు వియ్యంకుడు కావడం.. ఎంపీ కోటగిరి శ్రీధర్ మద్దతు పుష్కలంగా ఉండడంతో ఆయనకు సీటు విషయంలో తిరుగులేకుండా ఉంది. ఆర్థిక, అంగ బలాలు కూడా కలిసి రానున్నాయి. దూలం అవుట్.. భయంకరమైన వ్యతిరేకత సొంత పార్టీ నేతల నుంచే ఎదుర్కొంటోన్న నేతల్లో దూలం నాగేశ్వరరావు కూడా ముందు వరుసలో ఉన్నారు. అసలు ఆయనపై గత యేడాది కాలంగా సొంత పార్టీ నేతలే బహిరంగంగా ప్రెస్‌మీట్లు పెట్టి తీవ్ర విమర్శలు చేస్తున్నారు. అధిష్టానంకు దూలంపై సొంత పార్టీ ప్రజాప్రతినిధుల నుంచే లెక్కకు మిక్కిలిగా ఫిర్యాదులు వెళుతున్నాయి. పార్టీని కంట్రోల్ చేసే కోర్ టీం కీలక నేత కూడా దూలంకు టిక్కెట్ లేదని ఇప్పటికే నియోజకవర్గ నేతలతోనే అన్నట్టు తెలుస్తోంది. అయితే టీడీపీ ఇక్కడ నుంచి వచ్చే ఎన్నికల్లో బీసీని దింపుతుందా ? లేదా ? అన్న ఈక్వేషన్‌ను బట్టి కైకలూరు వైసీపీ క్యాండెట్ ఎవరు ? అన్నది డిసైడ్ కానుంది. వైసీపీ ఈ సారి కైకలూరు, ఉంగుటూరుల్లో ఓ సీటును ఖచ్చితంగా బీసీకి ఇవ్వనుంది. ఏదేమైనా దూలం మాత్రం అవుట్ కానున్నారు. ఇక గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పరిస్థితి రోజు రోజుకు అగమ్యగోచరంగా మారుతోన్న వాతావరణమే ఉంది. తీవ్రమైన వ్యతిరేకతతో ఆయన కొట్టుమిట్టాడుతున్నారు. ఇటీవల జరిగిన ద్వారకాతిరుమల మండలం జి. కొత్తపల్లి సంఘటన తర్వాత ఆయనపై సొంత పార్టీలోనే బలమైన వర్గాలు గుర్రుగా ఉన్నాయి. నాలుగు మండలాల్లో బలమైన వ్యక్తులు ఆయన నాయకత్వాన్ని అంగీకరించడం లేదు. ఆయనకు టిక్కెట్ రాదన్న సంకేతాలు రావడంతో గతంలో ఇక్కడ ఓసారి గెలిచి మంచి పట్టున్న ప్రస్తుత హోం మంత్రి తానేటి వనిత 2024లో ఇటు వైపు దృష్టి సారిస్తున్నారు. అలాగే జగన్‌కు బాగా నమ్మకస్తుడు అయిన ఓ ప్రభుత్వ అధికారి కూడా ఈ సీటు రేసులో ఉన్నారు. అటు హోం మంత్రి వనితతో పాటు సదరు ప్రభుత్వ అధికారి ఇద్దరికి జగన్, పార్టీ పెద్దల అండదండలు ఉన్నాయి. ఏదేమైనా జిల్లాలో ఎన్నికల వేళ చివర్లో జరిగే మార్పుల సంగతి ఎలా ? ఉన్నా ఈ మూడు సిట్టింగ్‌ల సీట్లు ఎగిరిపోవడం అయితే ఖాయమనే చర్చ ఆ పార్టీ అధిష్టాన వర్గాల్లోనే నడుస్తోంది.

## రథానికి రక్షణ కరువు

కాకినాడ, జూలై 11, లక్ష్మీనరసింహస్వామి వారి ఊరేగింపు రథం ఇప్పుడు ఎండకు ఎండి వానకు తడుస్తోంది. అయినప్పటికీ ఆలయ అధికారులు పట్టించుకోవడం లేదు. కొత్త రథం పాడవుతున్న ఎండోమెంట్ అధికారులు తమకు ఏమీ పట్టనట్లు చోద్యం చూస్తున్నారు కోనసీమ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం అంతర్వేది. వశిష్ట గోదావరి నది.. బంగాళాఖాతంలో సంగమించే ప్రాంతం.. అంతర్వేది. ఇక్కడ శ్రీలక్ష్మినరసింహం స్వామి కొలువై భక్తులతో పూజలను అందుకుంటున్నారు. అతిప్రాచీనమైన క్షేత్రం.. పురాణాల్లో ప్రస్తావన ఉంది. నరసింహస్వామి లక్ష్మీ సమేతుడై కొలువు తీరి కోరిన కోర్కెలు తీర్చే దైవంగా పూజలను అందుకుంటున్నాడు. సముద్ర తీరాన ఉన్న ఈ ఆలయం దక్షిణ కాశిగా పేరుగాంచింది. భీష్మ ఏకాదశి పర్వదినాన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహిస్తారు. తీర్థం కూడా ఉభయగోదావరి జిల్లాలో ఫేమస్. లక్ష్మీనరసింహ స్వామి ఊరేగింపుకు ఉపయోగించే రథం.. ఇక్కడ జరిగే రథయాత్రను దర్శించుకోవడానికి భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారు. సుమారు 62ఏళ్ల చరిత్ర ఉన్న రథం దగ్ధం అయింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త రథాన్ని నిర్మించింది. శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి ఊరేగింపు రథం ఇప్పుడు ఎండకు ఎండి వానకు తడుస్తోంది. అయినప్పటికీఆలయఅధికారులు పట్టించుకోవడం లేదు. కొత్త రథం పాడవుతున్న ఎండోమెంట్ అధికారులు తమకు ఏమీ పట్టనట్లు చోద్యం చూస్తున్నారు. రథాన్ని సురక్షితంగా పెట్టడానికి ఓ రేకుల షెడ్డుని కూడా ఆలయ అధికారులు నిర్మించడం లేదు. పాత రథం మంటల్లో కాలినప్పుడు.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సుమారు కోటి రూపాయలు వెచ్చించి బర్మా టేకుతో నిర్మించింది. ఇప్పుడు ఈ రథం వర్షానికి తడవడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్న హిందూ ధర్మిక సంఘాలు. అంతర్వేది శ్రీ లక్ష్మీనరశింహ స్వామి ఆలయ ప్రాంగణంలోని రథం దగ్ధం ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. కొత్త రథ నిర్మాణం కోసం ప్రభుత్వం తక్షణం 90 లక్షలుమంజూరుచేసింది. కొత్త రథం నిర్మాణ వ్యయం పెరగడంతో కోటి 10 లక్షలువెచ్చించింది. 40అడుగులఎత్తులోఏడు అంతస్తులతో రూపుదిద్దుకున్న నూతన రథాన్ని గత ఏడాది ఫిబ్రవరి 19 న సీఎం జగన్ ప్రారంభించారు.


## 10 రోజుల్లో 20 శాతం పెంపు



తిరుపతి జూలై 11, కోడిగుడ్డు ధర దూసుకెళుతోంది. వ్యాధి నిరోధక శక్తి పెరిగేందుకు గుడ్డు తినాలని వైద్యులు సూచించడంతో రెండేళ్లుగా వినియోగం పెరిగింది. డిమాండ్ పెరగడం, ఉత్పత్తి తగ్గడంతో కొంతమేర దిగుమతి తగ్గింది. దీంతో 30 గుడ్ల ట్రే రూ.120నుంచి రూ.180కి పెరిగింది. కోడిగుడ్ల ధర అమాంతం పెరిగిపోయింది. పదిరోజుల వ్యవధిలో గుడ్డుపై రూ.1.50 పెరిగింది. 30 గుడ్ల ట్రే పదిరోజుల క్రితం రూ.120 ఉండగా ప్రస్తుతం హోల్‌సేల్ దుకాణాల్లోనే రూ.160 నుంచి రూ.180వరకు విక్రయిస్తున్నారు. ఇక చిల్లర దుకాణాల్లో అయితే విడిగా రూ.7కు విక్రయిస్తున్నారు. చిత్తూరు నియోజకవర్గంలో రోజూ దాదాపుగా 3వేల బాక్సుల గుడ్లు అమ్ముడుపోతున్నాయి. చిత్తూరు ప్రాంతంలో గతంలో కంటే ప్రస్తుతం పౌల్ట్రీ పరిశ్రమలు తక్కువగా ఉండడంతో హైదరాబాద్, మహబూబ్‌నగర్, విజయవాడ ప్రాంతాల నుంచి గుడ్లు రవాణా చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది

## ప్రకాశం బ్యారేజీకి భారీ వరదనీరు 25 గేట్లు ఎత్తివేత..

విజయవాడలోని ప్రకాశం బ్యారేజీకి పెద్ద ఎత్తున వరదనీరు వచ్చి చేరింది. దాంతో బ్యారేజీ 25 గేట్లను తెరిచి నీటిని దిగువకు వదులుతున్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రకాశం బ్యారేజీకి వరద ప్రవాహం పెరిగిందని అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 42 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తున్నదన్నారు. ప్రకాశం బ్యారేజీ గేట్లు తెరిచి దిగువకు నీటిని విడుదల చేయడం ఈ సీజన్‌లో ఇదే తొలిసారి. ఇప్పటికే కాల్వల ద్వారా ఖరీఫ్ సాగుకు కృష్ణా తూర్పు, పడమరలకు నీటిని విడుదల చేశారు. పరివాహక ప్రాంతాల ప్రజలు మరో రెండు రోజుల పాటు పశువులు, గొర్రెలు, మేకలను మేతకు తీసుకెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



# విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన బస్సు..ప్రయాణికులు సురక్షితం

కనిగిరితెలంగాణలోని కామారెడ్డినుంచి ప్రకాశం జిల్లా వింజమూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు కు ప్రమాదం జరిగింది. బస్సు బలంగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. కనిగిరి కొత్తూరు వద్ద సుబ్బరామిరెడ్డి విగ్రహం దాటిన తర్వాత న ఘటన జరిగింది. దాంతో విద్యుత్ వైర్లు తెగి పడ్డాయి. అదృష్టవశాత్తూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రయాణికులకు పెను ప్రమాదం తప్పింది. బస్సు డ్రైవరు నిద్రమత్తులో విద్యుత్ స్తంభం ఢీకొట్టినట్లు స్థానికులు చెప్తున్నారు.

# కొత్తపేట పోలీస్ స్టేషన్ లో వైసిపి ఎమ్మెల్యే నిరసన

కొత్తపేట గోపాలపురంలో పేపర్ ప్లేట్లపై అంబేద్కర్ ఫోటోలు ముద్రించిన వివాదంలో 18 మంది దళిత యువకులపై పోలీసులు తప్పుడు కేసులు బనాయించారని ఆరోపిస్తూ రావులపాలెం పోలీస్ స్టేషన్లో కొత్తపేట వైసీపీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి నిరసన కొనసాగించారు. ఆదివారం సాయంత్రం ఐదు గంటల నుంచి ఎమ్మెల్యే నిరసన చేపట్టారు. రాత్రంతా పోలీస్ స్టేషన్లోనే నిద్రించారు. తప్పుడు కేసులు బనాయించిన పోలీసులపై చర్యలు తీసుకునేవరకు పోలీస్ స్టేషన్లో నిరసన కొనసాగిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి అమలాపురం ఎంపీ చింతా అనురాధ మద్దతు తెలిపారు. ఈ నేపథ్యంలో రావులపాలెం పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది.

# పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాస రెడ్డి



కడప పారిశుధ్య కార్మికుల డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్ శ్రీనువాసులు రెడ్డి అన్నారు. సోమవారం కడపలో ని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ ప్రభుత్వం వచిన్నపటి నుంచి పారిశుధ్య కార్మిక సమస్యలను పట్టించుకునే నాథుడే లేదని మండిపడ్డారుకరోన సమయంలో వారు చేసిన సేవలు అభినందనీయమని గుర్తు చేశారు35 వేల మంది కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ,9 ప్రధాన డిమాండ్లకు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఆరోగ్య భత్యాల బకాయిల,11 పీఆర్సీ సిఫార్సు ప్రకారం నెల జీతం,కార్మిక సిబ్బంది సంఖ్య పెంచడం వారి ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలి. పారిశుధ్యం కార్మికులు చేస్తున్న సమ్మెకు తన సంఘీభావం తెలుపుతున్నటు అన్నారు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి ఒక్క కార్మికుని సమస్యలను పరిష్కరిస్తామని శ్రీనివాస రెడ్డి హామీ ఇచ్చారు.

## అవుట్ సోర్సింగ్, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

### సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎం ఏ గఫూర్

కడప రాష్ట్ర వ్యాప్తంగా అపరి స్కృతంగా ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూనగరంలోని కడప కార్పోరేషన్ ఎదుట సిఐటియు, ఏఐటియూసి ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా హాజరైన గఫూర్ మాట్లాడుతూకాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలిని కోరారు. 11 పీఆర్సీ కనీస వేతనం రూ. 21000, పెండింగ్లో ఉన్న ఏడు నెలల హెల్త్ అలవెన్స్ ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా మని ప్రభుత్వ అధికారులు పదేపదే చెబుతున్న ఇంతవరకు అమలు కాకపోవడం దారుణమన్నారు. ఈ గాలి మాటలు చెబుతూ ఉద్యోగులను ఎన్ని రోజులు మోసం చేస్తారని ప్రశ్నించారు. ఇదేనా జగన్ మోహన్ రెడ్డి చెప్పిన మాటలు గాల్లో కలిసిపోయాయని ఎద్దేవా చేశారుముఖ్యమంత్రికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే వెంటనే కార్మికులతో చర్చలు జరిపి వెంటనే సమస్యలు పరిష్కరించాలని లేకుంటే ఉద్యమం ఉదృతం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ,సిఐటియు నాయకులు జి వేణు గోపాల్,కెసీ బాదుల్లా, సుంకర రవి ,ఎ రామ్మోహన్, మనోహర్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం దేవస్థాన సమీక్షా సమావేశం

శ్రీశైలం సోమవారం రోజు పాలనా సంబంధి అంశాలపై కార్యనిర్వహణాధికారి ఎస్. లవన్న సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.కార్యాలయ భవనములోని సమావేశ మందిరములో జరిగిన ఈ సమీక్షలో అన్ని విభాగాల యూనిట్ అధికారులు పర్యవేక్షకులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.సమావేశములో ముందుగా ఇటీవల శ్రీకాళహస్తి, కాణిపాకం, మహానంది, కసాపురం దేవస్థానాల నుంచి బదిలీపై వచ్చిన అధికారుల మరియు ఇతర ఉద్యోగుల పరిచయ కార్యక్రమం జరిగింది.తరువాత కార్యనిర్వహణాధికారివారు మాట్లాడుతూ ఇతర ఆలయాల నుంచి వచ్చిన ఉద్యోగులందరు కూడా వారికి కేటాయించిన స్థానాలలో వెంటనే బాధ్యతలు చేపట్టాలన్నారు. వారి వారి విభాగాలకు సంబంధించి అవగాహనను కలిగించుకోవాలన్నారు. ముఖ్యంగా ఉద్యోగులందరు కూడా దేవస్థానము భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసతి సదుపాయం, దర్శనం ఏర్పాట్లు, అన్నప్రసాద వితరణ, ఆన్లైన్ సేవలు, పరోక్షసేవలు.మొదలైనవాటిపైన కూడా అవగాహనను పెంపొందించుకోవాలన్నారు.ఇంకా వారు మాట్లాడుతూ ఎటువంటి అలసత్వం లేకుండా అందరు కూడా సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. అదేవిధంగా కార్యాలయ సమయపాలనను ఖచ్చితంగా పాటించాలన్నారు. కార్యాలయవేళలలో ఉద్యోగులందరు కూడా వారి వారి స్థానాలలో అందుబాటులో ఉండాలన్నారు. కార్యాలయములో మూమెంట్ రిజిష్టరును వెంటనే ఏర్పాటు చేయాలని పరిపాలనా విభాగాన్ని ఆదేశించారు.

# జనాలకు దగ్గరవుతున్న టీడీపీ, జనసేనలు

విజయవాడ, జూలై 11, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు మినీ మహానాడుల పేరుతో జిల్లాలను పర్యటిస్తున్నారు. బాదుడే బాదుడంటూ జనం మధ్యకు వెళుతున్నారు. పార్టీ క్యాడర్ ను ఉత్సాహపరుస్తున్నారు. నేతలను వచ్చే ఎన్నికలకు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రంలో ఎన్నికల వేడిని రగిలిస్తున్నారు. వచ్చే ఎన్నికలలో గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. మినీ మహానాడులో చేసేది రొటీన్ ప్రసంగం అయినా ఆయన నియోజకవర్గా సమీక్షలో కొంత వెరైటీ గా వ్యవహరిస్తున్నారు.చంద్రబాబు మినీ మహానాడులను ఇప్పటి వరకూ అనకాపల్లి, విజయనగరం, కడప, కర్నూలు, అన్నమయ్య జిల్లాల్లో నిర్వహించారు. సరే.. కార్యక్రమానికి హాజరువతున్నది జనమా? జిల్లా పరిధిలోని ఏడు నియోజకవర్గాల కార్యకర్తలా? అన్నది పక్కన పెడితే సభలకు, రోడ్ షోలకు భారీ జనసమీకరణే కన్పిస్తుంది. దీంతో చంద్రబాబు మహానాడుతో పాటు మినీ మహానాడులు సక్సెస్ అవుతున్నాయని భావించి రెట్టించిన ఉత్సాహంతో ఉన్నారు. చంద్రబాబు రోడ్ షోలు.. సభలు సక్సెస్ అవుతున్నాయా? లేదా? అన్నది ఇక్కడ ప్రధాన అంశం కాదు.

చంద్రబాబు వచ్చే ఎన్నికల్లో పొత్తుతో వెళ్లాలనుకుంటున్నారా? లేదా? అన్నది పార్టీలో జరుగుతున్న చర్చ. సభలు, రోడ్ షో లకంటే నియోజకవర్గాల సమీక్షల్లో బాబు నిర్ణయాలు హాట్ టాపిక్ గా మారాయి. ఉత్తరాంధ్రలో చంద్రబాబు పర్యటించనప్పుడు ఎలాంటి నిర్ణయాలు లేవు. కానీ సీమలో మాత్రం ఆయన నిర్ణయాలు ఆశ్చర్యపరుస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో జనసేనతో చంద్రబాబు పొత్తుకు వెళతారన్నది ఏపీ పాలిటిక్స్ తెలిసిన వారెవరైనా చెబుతారు. ఈసారి సింగిల్ గా వెళ్లే ప్రయోగం చంద్రబాబు చేయరన్నది అందరి మాట. ఉత్తరాంధ్రలో మాత్రం... అలాంటి తరుణంలో ఉత్తరాంధ్ర పర్యటనలో అభ్యర్థులను చంద్రబాబు ప్రకటించలేదు. కానీ సీమలో మాత్రం ఆయన అభ్యర్థులను ప్రకటించుకుంటూ వెళుతున్నారు. డోన్ లో సుబ్బారెడ్డి, రాజంపేట, కడప పార్లమెంటుకు గంటా నరహరి, శ్రీనివాసులురెడ్డి, పుంగనూరు చల్లా బాబు, పీలేరు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పేర్లను ప్రకటించారు. అంటే పొత్తులతో కాకుండా చంద్రబాబు సింగిల్ గా వెళ్లాలనుకుంటున్నారా? లేదా? సీమలో జనసేనకు బలం లేదని భావిస్తున్నారా? అన్నది తెలియడం లేదు. బీజేపీతో ఒకవేళ పొత్తు కుదిరితే రాజంపేట ఎంపీ స్థానాన్ని కోరుకుంటుంది. మరి బీజేపీని తాను వద్దను కుంటున్నారా? లేక బీజేపీయే తనను దగ్గరకు రానివ్వదని భావించి ఈ ప్రకటనలు చేస్తున్నారా? అన్నది తేలాల్సి ఉంది. మొత్తం మీద చంద్రబాబు పర్యటనల్లో ప్రకటనలతో పార్టీ నేతలే విస్తుబోతున్నారు.

# ఈ హామీల లెక్కలేంటీ

## సోషల్ మీడియాలో ట్రోల్

ఒంగోలు, జూలై 11, 'మేనిఫెస్టో అంటే భగవద్గీత.. మేనిఫెస్టో అంటే ఖురాన్.. మేనిఫెస్టో అంటే బైబిల్.. అధికారం అంటే అహంకారం కాదు అధికారం అంటే ప్రజల మీద మమకారం. ఈ మూడేళ్లలోనే 95 శాతం హామీలు అమలు చేశాం'.. ఇవీ వైసీపీ అధినేత, ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి తమ పార్టీ ప్లీనరీ వేదిక నుంచి చెప్పిన మాటలు. భగవద్గీత లాంటి, ఖురాన్ లాంటి, బైబిల్ లాంటి తమ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 95 శాతం నెరవేర్చి ఉంటే.. రాష్ట్రం ఎందుకు ఇంత అధ్వాన్నంగా తయారైందో.. ఎందుకు ఇంతలా దిగజారిపోయిందో.. ఎందుకు అభివృద్ధి అనే మాటకు అర్థం లేకుండా రాష్ట్రం అధోగతి పాలైందో.. ఇన్ని మాటలు చెప్పిన జగన్ రెడ్డికైనా అర్థమవుతోందా? అంటూ జనం ప్రశ్నిస్తున్నారు.రెడ్డి గత ఎన్నికల ముందు ఏపీ ప్రజలకు ఇచ్చిన హామీల్లో నెరవేర్చిన 95 శాతంలో పోలవరం ప్రాజెక్టు లేదా? పరుగులు పెట్టిస్తామన్న అమరావతి నిర్మాణం లేదా? 25 లక్షల ఇళ్లు కట్టిస్తామన్న హామీ లేదా? రైతులకు ఉచితంగా వేయిస్తామన్న బోర్లు లేవా? 45 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు ఇస్తానన్న పింఛను సంగతేమిటి? కేంద్రం మెడలు వంచి సాధిస్తామన్న ప్రత్యేక హోదా ఏమైందనే ప్రశ్నలు జనం నుంచి వస్తున్నాయి. అంటే తాను నెరవేర్చిన 95 శాతం హామీల నుంచి వీటిని మినహాయించారా? అని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నలు ట్రోల్ అవుతున్నాయి.ఆంధ్ర ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పట్టించుకోకపోవడం, ప్రజా రాజధాని అమరావతిని అటకెక్కించడం, ఏపీకి ప్రత్యేక హోదా గురించి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం, కేంద్రంతో సంబంధం లేకుండా రైతు భరోసా కింద ఇస్తానన్న 12 వేల 500 రూపాయలు ఇచ్చిందెక్కడ? కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానన్న హామీ ఏమైందని జనం జగన్ రెడ్డిని నెటిజనులు నిలదీస్తున్నారు. ప్రతి ఏడాది జనవరి నెలలోనే విడుదల చేస్తానని గొప్పలు చెప్పిన ఉద్యోగ క్యాలెండర్ ఏమైందని ప్రశ్నిస్తున్నారు.అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే వేస్తానన్న జగన్ మెగా డీఎస్సీ హామీ ఏమైంది స్వామీ అంటున్నారు. టీడీపీ హయాంలో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అన్న క్యాంటీన్లలో అవినీతి ఏదో జరిగిపోయిందని, ఆ అవినీతిని బయటపెట్టి, మూడు నెలల్లోనే రాజన్న క్యాంటీన్లు పెట్టేస్తానని చెప్పిన మాటలు నీటిమూటలేనా? కడప ఉక్కు కర్మాగారం ఏమైందని నెటిజన్లు ఏకి పారేస్తున్నారు. రాష్ట్రంలోని పేదలకు తెల్ల రేషన్ కార్డుపై సన్నబియ్యం అందిస్తానని చెప్పిన మాట తప్పలేదా? మడమ తిప్పలేదా అని నిలదీస్తున్నారు. ఎన్నికలకు ముందు అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే ఉద్యోగులకు సీపీఎస్ ను రద్దు చేస్తామని ఇచ్చిన భరోసా ఏ భోషాణంలో దాచారని అడుగుతున్నారు.

# కొడాలి నాని ఎంటర్టైన్మెంట్ ఎమ్మెల్యే మాత్రమే...నాయకుడు కాదు

## దమ్ముంటే రాజీనామా చేసి ఎన్నికలకు రావాలి

## టీడీపీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణరాజు



మంగళగిరి వైసీపీ ప్లీనరీ చూస్తే రాజకీయాల మీదే అసహ్యం పుడుతోందని టీడీపీ ఎమ్మెల్సీ మంతెన.సత్యనారాయణరాజు అన్నారు. సోమవారం అయన మీడియాతో మాట్లాడారు. విజయసాయిరెడ్డి కొడాలి నానిని మాట్లాడడానికి పిలిచేముందు కార్యకర్తలను ఉద్దేశించి మీకు ఎంటర్టైన్మెంట్ ఇస్తాను అని చెప్పారు. వైసీపీ ప్లీనరీ ఎంటర్టైన్మెంట్ కోసమే నిర్వహించుకున్నారు. కొడాలి నాని కార్యకర్తలకు ఎంటర్టైన్మెంట్ ఇచ్చే ఎమ్మెల్యే తప్ప, నాయకుడు కాదు. తాడేపల్లి ప్యాలెస్ లో నిర్వహించిన ప్రెస్మీట్ కు, ప్లీనరీకి ఏమాత్రం తేడాలేదు. ప్రతిపార్టీ రెండేళ్లకు ఒకసారి నిర్వహించుకునే ప్లీనరీలు, సమావేశాల్లో ముఖ్యంగా పార్టీ విధివిధానాలు, కార్యకర్తల నుండి సూచనలు, సలహాలు తీసుకుంటారు. కానీ వైసీపీ ప్లీనరీ మాత్రం ఎంటర్టైన్మెంట్ కోసమే నిర్వహించుకున్నట్లు ఉంది.కొడాలి నాని కంటే 420, వెధవ, సన్యాసి ఎవరూ రాష్ట్రంలో లేరు. కొడాలి.నాని గతంలో రావి శోభనాద్రి గారి వద్ద పనిచేసి, వాళ్లను అణగదొక్కి సీటు ఎలా తెచ్చుకున్నాడో గుడివాడ ప్రజలకు తెలుసు. కొడాలి నాని రాష్ట్ర నాయకుడు కాదు...గుడివాడకు రౌడీ మాత్రమే. టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేష్, పార్టీ నాయకులపై కొడాలి.నాని చేసే వ్యాఖ్యలను రాష్ట్ర ప్రజలు అసహ్యించుకుంటున్నారు.కొడాలి.నాని బూతులు తిడుతుంటే...వైసీపీ అధినాయకుడు ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నాడు...అదే స్థానంలో టీడీపీ అధినాయకుడు ఉంటే ఖచ్చితంగా ఆపేవారు...జగన్ రెడ్డి బూతుల్ని ఆస్వాదించడం అత్యంత హాస్యాస్పదమని అన్నారు.నీకు దమ్ముంటే ప్రజాక్షేత్రంలో చూసుకోవాలి కానీ...తిట్టించడం సరికాదు జగన్ రెడ్డి. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటినుండి అన్ని వ్యవస్థల మీద దాడి జరుగుతోంది...తాజాగా మీడియా మీద దాడి చేస్తున్నారు.గుండు కొట్టడమే గుడివాడ ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ప్రజలను అష్టకష్టాలకు గురిచేసి, ప్లీనరీలో జగన్ రెడ్డి రాక్షసానందం పొందారని విమర్శించారు. ప్రభుత్వాలతో సంబంధం లేకుండా పనిచేస్తుంది గనుకే ఈనాడు సంస్థలు 50ఏళ్లుగా కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి ఇప్పటికైనా వాళ్ల నాయకులను కంట్రోల్ చేయాలి...లేదంటే తగిన గుణపాఠం తప్పదు. ఈ రాష్ట్రంలో 420 ఎవరో థర్డ్ పార్టీతో సర్వే చేయించుకుంటే తెలిపోతుంది. కొడాలి నాని బొచ్చు ఊడడానికి పనామా లేదా జిల్లెట్ బ్లేడ్ ఒక్కటి చాలు.....చంద్రబాబు, లోకేష్ అవసరం లేదు. కొడాలి నానికి దమ్ముంటే...రాజీనామా చేసి ఎన్నికలకు రావాలి...అప్పుడు తెలిపోతుంది ఎవరి బొచ్చు ఊడుతుందో. కొడాలి నాని గుడివాడ ఓటర్ల గురించి భ్రమలో బ్రతుకుతున్నాడు. రాజకీయ నాయకుల విశ్వరూపం ప్రజాక్షేత్రంలో రుజువుకావాలి కాని...మాటల్లో కాదు. మీడియా సంస్థలు ఏం పాపం చేశాయి..వాటిని చూసి జగన్ రెడ్డికి ఎందుకు భయం పట్టుకుంది...ఎందుకు వాటిపై విషం కక్కుతున్నారు....? జగన్ రెడ్డికి వ్యతిరేకంగా వస్తున్న కోర్టు తీర్పులపైనా వైసీపీ నాయకులు విషయం కక్కుతున్నారు..ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా ఏపీలో వైసీపీ పాలనలో జ్యుడిషరీ వ్యవస్థపై దాడి జరుగుతోంది. రాష్ట్ర ప్రజలు దీన్ని గమనించాలని అయన అన్నారు

# ముందస్తు ఎన్నికలు జరుగుతాయన్న ప్రచారంలో వాస్తవం లేదు

## వైసీపీకి ఇది సరైన సమయం...

## సీబీఐ మాజీ జేడీ లక్ష్మీ నారాయణ



ప్రకాశం జూలై 11 దేశ వ్యాప్తంగా ముందస్తు ఎన్నికలు జరుగుతాయన్న ప్రచారంలో వాస్తవం లేదని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీ నారాయణ స్పష్టం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... వైసీపీ ప్లీనరీ తర్వాత ఆరు నెలల ముందుగానే ఎన్నికలు జరుగుతాయనే ప్రచారం ముమ్మరమైందన్నారు. ప్రజలు రాజకీయ నాయకులను ఐదేళ్ల కోసం ఎన్నుకుంటారని, ఎన్నికలు ముందుగా నిర్వహించటం వల్ల కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతుందని వెల్లడించారు. ముందస్తు ఎన్నికల ప్రచారంతో ప్రజలు ఎన్నికల మూడ్లోకి వెళ్లిపోయి అసలు సమస్యలు పక్కదారి పడతాయన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య, రాష్ట్రాల అప్పులపై చర్చలు జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు.వైసీపీకి ఇది సరైన సమయం....రాష్ట్రపతి ఎన్నికలలో తమ అభ్యర్థిని గెలిపించేందుకు కావాల్సిన పూర్తి మెజారిటీ బీజేపీ కి లేదన్నారు. రాష్ట్రపతి ఎన్నికలలో గెలిచేందుకు బీజేపీకి వైసీపీ మీద ఆధారపడాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రత్యేక హోదా డిమాండ్ను నెరవేర్చుకునేందుకు వైసీపీకి ఇది సరైన సమయమని చెప్పుకొచ్చారు. బీజేపీని ప్రత్యేక హోదా దిశగా ఒత్తిడి చేసి సాధించటంతో ద్వారా రాష్ట్ర ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని జేడీ లక్ష్మీ నారాయణ చెప్పుకొచ్చారు.

# నందిగామ లో అన్నా క్యాంటిన్ ప్రారంభోత్సవంర్యాలీ

నందిగామ ఎన్టీఆర్ జిల్లా నందిగామ లో అన్నా క్యాంటిన్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ నేపథ్యంలో టీడీపీ శ్రేణులు ర్యాలీగా బయలుదేరారు. పోలీసులు ర్యాలీ ని అడ్డుకున్నారు. ప్రచార రథం పై నుంచి దిగి వచ్చిన యంపి కేశినేని నాని, పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అక్కడినుంచి టిడిపి నాయకులు కేశినేని నాని,తంగిరాల సౌమ్య, నెట్టెం రఘురాం,తాతయ్య తదితరులు పాదయాత్ర గా ముందుకు కు వెళ్లారు.

# శాఖాంబరీగా కామేశ్వరి అమ్మ వారు:



నంద్యాల నంద్యాల జిల్లా మహానంది క్షేత్రంలో వెలసిన కామేశ్వరి అమ్మ వారు అశాడ మాసం గురు పౌర్ణమి బుధవారం రోజు శ్రీ కామేశ్వరి అమ్మ వారు శాఖాంబరీ గా ఉత్సవమునకు ముస్తాబు చేస్తారని ఈఓ చంద్రశేఖర్ రెడ్డి సోమవారం నాడు ఓ ప్రకటనలో తెలిపారు. శాఖాంబరీ ఉత్సవాల నేపథ్యంలో చేసే అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ప్రదానంగా కూరగాయలు ఆకు కూరలు పండ్లు పూలతో కామేశ్వరి అమ్మ వారి గుడిని కనుల పండువగా అలంకరిస్తారు. అమ్మ వారి దర్శనంతో పాటు ఈ అలంకరణ చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. ప్రజలు పాడి పంటలు. సుఖ సంతోషాలతో విరా జిల్లేందుకు జగన్మాత శ్రీ కామేశ్వరి అమ్మను ప్రకృతి మాతగా కొలి చేందుకు కూరగాయలు. అకు కూరలు. పండ్లు. పూలతో అలంకరిస్తారు. ఈ సారి శ్రీ కామేశ్వరి అమ్మ శాఖాంబరీగా అలంకరణ కు కావలసిన 500 కేజీలు వివిధ రకాల ఆకు కూరలు కూరగాయలను . 500 కేజీల వివిధ రకాల పండ్లను వితరణగా మార్కెట్ కమిటీ మెంబర్ లక్క బోయిన ప్రసాద్ సమ కూర్చు తున్నారని ఈవో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. శాఖాంబరీ అమ్మ వారికి కావలసిన కూరగాయలను పండ్లను సమకూర్చిన లక్క బోయిన ప్రసాద్ వారి కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

# తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ వింత పోకడలు

విజయవాడ జూలై 11 : తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ వింత పోకడలు చూస్తున్నామని ఎంపీ జీవీఎల్ అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... వైసీపీ ప్లీనరీ లో వారి నాయకుడిని శాశ్వత అధ్యక్షుడిగా ఎన్నుకున్నారని, ఈ విధానం ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పు అని తెలిపారు. ఇటువంటి వింత పోకడలను వైసీపీ మానుకోవాలని హితవుపలికారు. వైసీపీ టీడీపీ లో బానిసత్వ ధోరణి కనిపిస్తోందని విమర్శించారు. కుటుంబ పాలన వ్యవస్థ దేశానికి ముప్పు అని ఎంపీ జీవీఎల్ అన్నారు.

# ప్రజా సమస్యలను పరిష్కరించండివచ్చిన ఫిర్యాదు మరోసారి రాకుండా చూడాలి

### జిల్లా కలెక్టర్ వి విజయ్ రామరాజు

కడప ప్రజా సమస్యల పరిష్కారార్థం ఏర్పాటు చేసిన "స్పందన" కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాల్లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ "స్పందన" కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు తో పాటు జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ , ఇంఛార్జి డిఆర్వో, స్పెషల్ కలెక్టర్ రామమోహన్, డ్వామ, డిఆర్డీఏ పీడిలు యదుభూషన్ రెడ్డి, పెద్దిరాజు, అనుడ విసి శ్రీలక్ష్మి..లు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించా లన్నారు స్పందన ద్వారా.. ప్రజల నుండి అందిన విజ్ఞప్తులలో కొన్ని కాజీపేట మండలం.. పుత్తూరు గ్రామానికి చెందిన గంగారపు చంద్ర శేఖర్.. తనకు రెషన్ కార్డు ఉందని, తన కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం రావడంతో.. తన కుటుంబానికి అందాల్సిన అన్ని సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నామని.. దయచేసి మాకు పథకాలను వర్తింపజేయండి అని కోరుతూ జిల్లా స్పందనలో అర్జీ సమర్పించారు సిద్దవటం మండల కేంద్రంకు చెందిన వెంకట రాజేష్ ప్రాథమిక పాఠశాలలను హై స్కూల్ లో విలీనం చేయడాన్ని నిలిపివే స్తూగత కమిషనర్ ఇచ్చిన ఆదేశాల మేరకు.. ఏడవ తరగతి వరకు వర్తింపజేయాలని కోరుతూ.. జిల్లా స్పందనలో అర్జీ ద్వారా విన్నవించారు.వి.ఎన్. పల్లె మండలం అనిమెల గ్రామానికి చెందిన సగిలి కేశవరెడ్డి గ్రామ పొలంలో సాగులో ఉన్న భూమివ ద్దకు వెళ్లేందుకు దారి లేదని ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా స్పందన కార్యక్రమంలో కలెక్టర్ వారికి వినతిపత్రం సమర్పించారు.

# స్పందన అర్జీలకు సంబంధించి నాణ్యతతో పరిష్కారం, రీఓపన్ మీద దృష్టి పెట్టండి



కర్నూలు జూలై, 11 : స్పందన అర్జీలకు సంబంధించి నాణ్యతతో పరిష్కారం, రీఓపన్ మీద దృష్టి పెట్టండి అని కర్నూలు జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి తదితరులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం స్పందన అర్జీల పరిష్కారంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన అర్జీలు గడువు దాటినవి లేవని, ఈ సంఖ్య జీరో ఉందని, దీనిని ఇలాగే కొనసాగించాలని సూచించారు...అర్జీలను ఏరోజు కారోజు వెంటనే పరిష్కరిస్తే, పరిష్కారంలో నాణ్యత ఉంటుందని, తద్వారా రీ ఓపెన్ అయ్యే అవకాశాలు ఉండవని సూచించారు... గడువు దాటే వరకు ఉంటే, తొందరలో సరైన పరిష్కారం లేక, రీఓపెన్ అయ్యే అవకాశాలు ఉంటాయన్నారు. రీఓపెన్ అయినవి 10 ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామ వార్డు సచివాలయం ద్వారా అందించే సేవలకు సంబంధించి కూడా గడువు దాటినవి జీరో ఉన్నాయని ,ఇదే స్ఫూర్తితో త్వరితగతిన సేవలందించాలని కలెక్టర్ ఆదేశించారు.గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా వచ్చిన అర్జీలకు సంబంధించి ఎప్పటికప్పుడు నివేదికలు పంపాలని ఎంపీడీవోలను అదేశించారు. ఇప్పటి వరకు పెండింగ్ ఉన్న అర్జీల వివరాలను మూడు రోజుల్లో పంపించాలని కలెక్టర్ ఆదేశించారు.. హౌసింగ్ సైట్ లకు ఈ-కేవైసీ ప్రక్రియ ను వేగవంతం చేసి పూర్తి చేయాలని ఎంపీడీవో లను ఆదేశించారు. ఇప్పటి దాకా

**అర్జీలను ఏరోజు కారోజు వెంటనే పరిష్కరించండి-:**
**కర్నూలు జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు**

మొదలుకాని మండలాలలో వెంటనే ప్రక్రియను మొదలుపెట్టాలన్నారు.. పాఠశాలలో తెరుచుకున్న నేపథ్యంలో సచివాలయ సిబ్బంది పాఠశాలలను విజిట్ చేసి ఎంపీడీవోల ద్వారా కన్సిస్టెంట్ రిథమ్ అనే యాప్ ద్వారా నివేదికను పంపాలన్నారు. ఈ-శ్రమ్ కి సంబంధించి ఇంకా 97 సచివాల యాల్లో ఇంకా రిజిస్ట్రేషన్ మొదలు కాలేదని వాటికి సంబంధించి జెడ్పీ సీఈఓ దృష్టి పెట్టి రిజిస్ట్రేషన్ పూర్తి చేయించాలని కలెక్టర్ ఆదేశించారుసమీక్షలో జిల్లా అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు

# ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న నారాయణ, కేశవరెడ్డి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి....ఎస్ఎఫ్ఐ



నంద్యాల జూలై 11 నంద్యాల పట్టణంలోని నారాయణ, కేశవరెడ్డి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సామున్ మరియు జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ మూర్తి గారికి పత్రం ఇవ్వడం జరిగిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నిరంజన్, అధ్యక్షుడు లక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శి దినేష్ కుమార్, నాయకులుప్రేమ్ కుమార్ తెలిపారుఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక నంద్యాల పట్టణంలో ఉన్నటువంటి నారాయణ, కేశవ రెడ్డి విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయని2022-2023 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు నిలిపివేయాలని అన్నారు. నారాయణ,కేశవ రెడ్డి విద్యా సంస్థలు పాఠశాలకు ఉండాల్సిన టువంటి ఆటస్థలం, ఫైర్ సర్టిఫికేట్, మున్సిపల్ శానిటరీ సర్టిఫికేట్, పోలీస్ నా అబ్జక్షన్ సర్టిఫికెట్, లేకపోవడమే కాక, విశాలమైన తరగతి గదులు విద్యార్థులకు సరిపడా మూత్రశాలలు మరుగుదొడ్లు మొదలగు మౌలిక సదుపాయాలు లేవని తెలిపారు. అదేవిధంగా జలగలు రక్తాన్ని పీల్చి నట్టు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. మానసికంగా విద్యార్థులు ఉత్తేజం పొందడానికి అదేవిధంగా క్రీడల్లో విద్యార్థులు రాణించడానికి విద్యార్థులకు అవసరమైన ఆటస్థలం లేనందున ఆటల పైన మక్కువ ఉన్నటువంటి విద్యార్థులకు చాలా ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు. అదేవిధంగా దుకాణాల్లో అమ్మే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్కూల్ బ్యాగ్, టై, బెల్ట్, స్కూల్ యూనిఫామ్ మొదలైనవి పాఠశాలలోనే అమ్ముతూ పాఠశాలనే అంగడి సరుకుగా మారుస్తున్నారు. కావున విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి 2022-23 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. స్పందించిన జిల్లా కలెక్టర్ మరియు జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే పాఠశాల పై చర్యలు తీసుకుంటామని తెలియజేశారు

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం



**కర్నూలు జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఐపియస్**
**స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి , పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ**

కర్నూలు జూలై 11 -:కర్నూలు నగరంలోని కొత్తపేట దగ్గర ఉన్న స్పందన కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఐపియస్ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి స్పందన కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...1) దుబాయ్ లో డ్రైవర్ గా ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి 2 లక్షలు తీసుకొని మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సూది రెడ్డి పల్లెకు కి చెందిన అజయ్ కుమార్ ఫిర్యాదు చేశారు .2) హైదరాబాద్ కు చెందిన ఇండియా బుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు 3 లక్షలు పర్సనల్ లోన్ ఇస్తామని చెప్పి నమ్మించి ఆన్ లైన్ లో 70 వేలు కట్టించుకొని మోసం చేశారని పెద్దపాడు గ్రామానికి చెందిన రాజన్న ఫిర్యాదు చేశారు. 3) ఆన్ లైన్ యాప్ ద్వారా లోన్ తీసుకున్నాము తిరిగి చెల్లించాము అయిన తిరిగి మరల డబ్బులు చెల్లించాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని కర్నూలు చెందిన ఒక మహిళ ఫిర్యాదు చేశారు. 4) బసాపురం గ్రామ పొలిమేరలో ఉన్న నా 25 సెంట్ల స్థలాన్ని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని నిడ్జూరు గ్రామానికి చెందిన బోయ చిన్న వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు.స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ హామీ ఇచ్చారు.ఈ స్పందన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ప్రసాద్, డీఎస్పీ యుగంధర్ బాబు , స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రసాద్ పాల్గొన్నారు.

# 35 వార్డు ఉమామహేశ్వరి నగర్ లో రోడ్లు కాలువలు వేయాలి సిపిఎం

కర్నూలు , జూలై, 11 :కర్నూలు నగర పాలక సంస్థ 35 వార్డు పరిధి లోని ఉమామహేశ్వరి నగర్ లో కాలువలు రోడ్లు వేయాలని సిపిఎం ప్రతినిధి బృందం స్పందన కార్యక్రమం లో కమిషనర్ భార్గవ్ తేజ గారికి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె సుధాకరప్ప మాట్లాడుతూ ఉమామహేశ్వరి నగర్ లో గత 10 సంవత్సరాలుగా పేద మధ్యతరగతి ప్రజలు రోజు వారి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు

# పుష్కర కాలం తర్వాత కలుస్తున్నారు.. ఈసారి ఎలాంటి ఫలితాన్ని అందుకుంటారో..?



సూపర్ స్టార్ మహేశ్ బాబు మరియు డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్ పై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఉంటాయి. వీరి కలయికలో గతంలో వచ్చిన 'అతడు' సినిమా మంచి విజయం సాధించింది. అయితే ఆ తర్వాత వచ్చిన 'ఖలేజా' చిత్రం మాత్రం బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. అయినప్పటికీ ఈ సినిమా బుల్లితెరపై విపరీతమైన ఆదరణ దక్కించుకుంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు వీరిద్దరూ ముచ్చటగా మూడోసారి జతకట్టబోతున్నారు.మహేష్ - త్రివిక్రమ్ కాంబోలో హ్యాట్రిక్ మూవీ ఎస్ఎస్ఎంబీ28 కు చాలా కాలం క్రితమే అధికారిక ప్రకటన వచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించారు. 'సర్కారు వారి పాట' సినిమా వచ్చి రెండు నెలలు గడుస్తుండటంతో ఈ ప్రాజెక్ట్ ఎప్పుడు సెట్స్ మీదకు వెళ్తుందని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.అయితే తాజా సమాచారం ప్రకారం మహేష్ 28వ సినిమా రెగ్యులర్ షూటింగ్ ను ఆగస్టులో స్టార్ట్ చేస్తారు. మహేశ్ హాలిడేలో ఉన్నప్పుడు త్రివిక్రమ్ పూర్తి స్క్రిప్ట్ ను నెరేట్ చేసాడు. అగ్ర హీరో అందులో పలు మార్పులు సూచించగా.. అన్ని చేంజెస్ చేసిన దర్శకుడు ఫైనల్ స్క్రిప్టును వివరించాడు. దీనికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన మహేష్.. షెడ్యూల్ ను ప్లాన్ చేసుకోమని చెప్పినట్లు తెలుస్తోంది.ఇప్పటికే సెట్స్ నిర్మాణం మొదలుపెట్టిన నేపథ్యంలో వచ్చే నెల మొదటి వారంలో షూటింగ్ ప్రారంభించాలని భావిస్తున్నారట. మరోవైపు నటీనటులు సాంకేతిక నిపుణులను ఖరారు చేశారని తెలుస్తోంది. అన్నీ ప్లాన్ ప్రకారం జరిగితే 2023 ప్రథమార్థంలో ఈ సినిమా రిలీజ్ కు రెడీ అవుతుంది.త్రివిక్రమ్ తో చేసిన రెండు సినిమాలలోనూ మహేష్ బాబు చాలా డిఫరెంట్ గా కనిపించారు. 'అతడు' లో సటిల్ క్యారక్టర్ లో కనిపిస్తే.. 'ఖలేజా' తో తనలోని కామెడీ యాంగిల్ ను బయటకు తీశారు. అందుకే ఈ క్రేజీ కాంబో పై అందరిలో ఆసక్తి నెలకొంది. దాదాపు 12 ఏళ్ల తర్వాత దర్శక హీరోలు కలసి చేస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.ఈ నేపథ్యంలో సెట్స్ మీదకు వెళ్ళకుండగానే ఈ ప్రాజెక్ట్ నాన్-థియేట్రికల్ రైట్స్ భారీ ధర పలికిందని టాక్ వినిపిస్తోంది. ఇంకా టైటిల్ పెట్టని ఈ సినిమా కోసం మహేష్ బాబు మరియు త్రివిక్రమ్ ఇద్దరూ భారీ రెమ్యూనరేషన్ తీసుకోనున్నారని ప్రచారం జరుగుతోంది. 'అల వైకుంఠపురములో' తర్వాత దర్శకుడు చేయనున్న సినిమా ఇదే.ఎస్ఎస్ఎంబీ28 చిత్రాన్ని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్ పై రాధాకృష్ణ ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్నారు. ఇందులో మహేశ్ సరసన పూజా హెగ్డే హీరోయిన్ గా నటించనుంది. ఎస్ఎస్ థమన్ సంగీతం సమకూరుస్తున్న ఈ ఫ్యామిలీ ఎంటర్టైనర్ కు ఆర్.మాది సినిమాటోగ్రఫీ నిర్వహిస్తారు. పుష్కర కాలం తర్వాత మహేష్ - త్రివిక్రమ్ కలిసి చేయబోతున్న ఈ మూవీ ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

# బన్నీతో లింగుస్వామి సెట్ అవ్వలేదనేసిన డైరెక్టర్!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథానాయకుడిగా కోలీవుడ్ స్టార్ మేకర్ లింగుస్వామి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతుం దని చాలా కాలంగా వినిపిస్తోన్న సంగతి తెలిసిందే. రామ్ తో లింగు తెరకెక్కిస్తోన్న వారియర్ ముందు నుంచే లింగు స్వామి బన్నీ రేసు లో ఉన్నారు. భారీ యాక్షన్ థ్రిల్లర్ స్క్రిప్ట్ కూడా



లాక్ అయిందని...ఆన్ సెట్స్ కి వెళ్లడమే ఆలస్యమని బలమైన ప్రచారమే సాగింది.ఈ వార్తల్ని అల్లు కాంపౌండ్ కూడా ఏనాడు ఖండించలేదు. దీంతో కాంబినేషన్ పక్కా అనుకున్ని బన్నీ అభిమానులు నమ్మారు. బన్నీ లాంటి ఎనర్జిటిక్ హీరోకి సరైన యాక్షన్ మేకర్ దొరికితే ఆ కాంబినేషన్ నెక్స్ట్ లెవల్లో ఉంటుందని అంచనాలు స్కైని టచ్ చేసాయి. గీతా ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుందని అంతే ధీటుగా ప్రచారం సాగింది.తాజాగా చెన్నై లో జరిగిన వారియర్ వేదికగా వీటన్నింటిపై పూర్తి క్లారిటీ వచ్చేసింది. బన్నీకి లింగు స్వామి స్టోరీ చె ప్పడం నిజమే. స్టోరీ నచ్చితే ఆ చిత్రాన్ని గీతా ఆర్ట్స్ ఎన్ని కోట్లు అయినా ఖర్చుతోనైనా నిర్మించాలని బలంగా సంకల్పించింది వాస్తవమే. కానీ లింగుస్వామికి అది ఇప్పట్లో సాధ్యమయ్యే పని కాదని తాజాగా ఆయన మాటల్లోనే తేలిపోయింది."బన్నీతో సినిమా చేయాలనుకున్నాను. కథ కూడా చెప్పాను . కానీ ఎందుకనో కుదరలేదు. అలాగే సూపర్ స్టార్ మహేష్ తో కూడా చేయాలని ఆయన్ని అప్రోచ్ అయ్యాను. ఆయన కూడా తన కథకి" నో చెప్పినట్లు లింగుస్వామి రివీల్ చేసారు. మా కాంబినేషన్స్ ఎందుకు సెట్ కాలేదో తెలియదు. కానీ ఇప్పట్లో అది జరిగేలా లేదని లింగు స్వామి హింట్ ఇచ్చారు.ఆయన మాటల్ని బట్టి స్క్రిప్ట్ దగ్గరే లింగు స్వామికి ఆ ఇద్దరు బ్రేక్ వేసినట్లు తెలుస్తోంది. మహేష్ సంగతి పక్కన బెడితే బన్నీనే లింగు స్వామిని ఎక్కువగా డిజప్పాయిం ట్ చేసినట్లు కనిపిస్తుంది. ముందుగా లింగుస్వామి బన్నీ ఇమేజ్ని దృష్టిలో పెట్టుకునే కథ రాసి అప్రోచ్ అయి వినిపించి ఉంటారు. బన్నీ రిజెక్ట్ చేయడం తో అదే కథతో మహేష్ ని అప్రోచ్ అయి ఉండొచ్చు.ఆయనకి కూడా కథ నచ్చకపోవడంతో నో చెప్పి ఉండొచ్చని తెలుస్తోంది. ఆ ఇద్దరు రిజెక్ట్ చేసిన తర్వాత రామ్ వారియర్ స్టోరీతో లాక్ చేసి పట్టాలెక్కించినట్లు తెలుస్తోంది. మరి ఈవారియర్ కథనే ఆ ఇద్దరికి చెప్పారా? లేక ఇది ఫ్రెష్ స్టోరీనా? అన్నది ఇంకా బయటకు రాలేదు. వారియర్ పై ఇప్పటికే భారీ అంచనాలు కొన్నాయి.సినిమాకి అన్ని వైపులా పాజిటివ్ సైన్ కనిపిస్తుంది. ఈ సినిమాతో రామ్ కోలీవుడ్ లోనూ ఎంట్రీ ఇస్తున్నాడు. హిట్ కొడితే గనుక ఆ ఇద్దరు డిజప్పాయింట్ అవ్వక తప్పదు. వారియర్ సక్సెస్ అయితే ఆ ఇద్దరు పరిగెట్టుకుని మరీ వస్తారు. లింగుస్వామికి యాక్షన్ మేకర్ గా మంచి పేరున్న సంగతి తెలిసిందే.

# మాస్ స్టెప్పులతో విజయ్ దుమ్ము దులిపేశాడు

క్రేజీ హీరో రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ నటిస్తున్న పాన్ ఇండియా మూవీ 'లైగర్'. వెర్సటైల్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ మూవీతో పాన్ ఇండియా మార్కెట్ ని టార్గెట్ చేశాడు. బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే ఈ మూవీ ద్వారా తెలుగు తెరకు హీరోయిన్ గా పరిచయం అవుతుండగా విజయ్ దేవరకొండ బాలీవుడ్ కు పరిచయం అవుతున్నారు. దాదాపు రెండేళ్లుగా ఈ మూవీ కోసం శ్రమించడమే కాకుండా విజయ్ భారీ అంచనాలు పెట్టుకున్న మూవీ ఇది.ఈ సినిమాతో తన పాన్ ఇండియా భవితవ్యాన్ని తేల్చుకోబోతున్నారు. చార్మీ పూరితో కలిసి బాలీవుడ్ మేకర్స్ కరణ్ జోహార్ హీరూ జోహార్ అపూర్వ మోహతా ధర్మా ప్రొడక్షన్స్ పై పూరి కనెక్ట్స్ తో కలిసి ఈ మూవీని నిర్మిస్తున్నారు. రిలీజ్ కి రెడీ అవుతున్న ఈ సినిమా ఆగస్టు 25న అత్యంత భారీ స్థాయిలో తెలుగు హిందీ తమిళ మలయాళ కన్నడ భాషల్లో ఏక కాలంలో రిలీజ్ కాబోతోంది. తెలుగుతో పాటు హిందీలోనూ ద్విభాష చిత్రంగా ఈ మూవీని ఏక కాలంలో నిర్మించారు. ప్రపంచ ప్రఖ్యాత బాక్సర్ మైక్ టైసన్ కీలక అతిథి పాత్రలో నటిస్తున్నారు. రమ్యకృష్ణ రోనిత్ రాయ్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీపై ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. మైక్ టైసన్ కీలక అతిథి పాత్రలో నటిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్ అంతర్జాతీయ ట్రేడ్ వర్గాల దృష్టిపడింది.ముంబై స్లమ్ ఏరియాలో వుండే ఛాయ్ బండీవాలా బాక్సింగ్ లో వరల్డ్ ఛాంపియన్ గా ఎలా అవతరించాడనే కథాంశంతో ఈ మూవీని తెరకెక్కించారు. ఇటీవల విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ టీజర్ సినిమాపై అంచనాల్ని పెంచేసింది.సినిమా రిలీజ్ మరో నెల రోజులకు మించి వుండటంతో చిత్ర బృందం ప్రమోషన్స్ ని మొదలు పెట్టింది. శుక్రవారం పెప్పి నంబర్ గా ఫస్ట్ సింగిల్ గా 'అక్డి పక్డి..' అంటూ సాగే లిరికల్ సాంగ్ ప్రోమోని విడుదల చేసింది. లిజో జార్జ్ డీజే చేతాస్ ఈ పెప్పీ నంబర్ కు సంగీతం అందించాడు. భాస్కర భట్ల సాహిత్యం అందించిన ఈ పాటని అనురాగ్ కులకర్ణి రమ్య బెహెరా అలపించారు. ఈ పాటలో విజయ్ దేవరకొండ మాసీవ్ స్టెప్పులతో విజిల్స్ తో అదరగొట్టేశాడు.ఫ్లోర్ స్టెప్పులతో హంగామా చేశాడు. ఫస్ట్ టైమ్ విజయ్ దేవరకొండ ఈ రేంజ్ మాస్ బీట్ కి అదిరిపోయే స్టెప్పులేశాడు. అతనితో పోటీపడుతూ అనన్య పాండే గ్లామర్ షో చేస్తూ తనదైన




గ్రేస్ తో ఆకట్టుకునే ప్రయత్నం చేసింది.

# మ్యాచ్ మధ్యలో కరోనాగా నిర్ధారణ.. బెంబేలెత్తిపోతున్న ఆటగాళ్లు



శ్రీలంక-ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న టెస్ట్ సిరీస్‌పై కరోనా మహమ్మారి పంజా విసురుతుంది. ఆతిథ్య శ్రీలంక జట్టుకు చెందిన ఆటగాళ్లు వరుసగా వైరస్ బారిన పడుతున్నారు. రెండో టెస్ట్ మ్యాచ్ మధ్యలో ఓపెనర్ పథుమ్ నిస్సంకకు పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో కోవిడ్ బారిన పడిన లంక ఆటగాళ్ల సంఖ్య ఆరుకు చేరింది. మూడో రోజు ఆట మధ్యలో అస్వస్థతకు గురైన నిస్సంకకు ర్యాపిడ్ యాంటిజెన్ పరీక్ష చేయగా పాజిటివ్ రిజల్ట్ వచ్చింది.దీంతో అతను మ్యాచ్ మధ్యలోనే వైదొలిగాడు. అతని స్థానంలో ఒషాడ ఫెర్నాండో కోవిడ్ సబ్‌స్టిట్యూట్‌గా జట్టులోకి వచ్చాడు. అంతకుముందు తొలి టెస్ట్ మ్యాచ్ సందర్భంగా లంక స్టార్ ఆటగాడు ఏంజలో మాథ్యూస్ సైతం ఇలానే మ్యాచ్ మధ్యలో కోవిడ్ బారిన పడ్డాడు.ఆ తర్వాత జట్టు మొత్తానికి జరిపిన ఆర్టీపీసీఆర్ పరీక్షల్లో మరో నలుగురికి (ప్రవీణ్ జయవిక్రమ, ధనంజయ డిసిల్వ, జెఫ్రె వాండర్సే, అషిత ఫెర్నాండో) కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. శ్రీలంక జట్టులో వరుసగా కోవిడ్ కేసులు వెలుగుచూస్తున్నా ప్రత్యర్థి ఆస్ట్రేలియా జట్టులో ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడం విశేషం.ఇదిలా ఉంటే, కోవిడ్ కేసు వెలుగుచూసినా మ్యాచ్ యధాతథంగా కొనసాగుతుంది. నాలుగో రోజు ఆటలో సెంచరీ హీరో దినేశ్ చండీమాల్ మరింత రెచ్చిపోయి డబుల్ బాదడంతో శ్రీలంకకు 190 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. 431/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన శ్రీలంక మరో 123 పరుగులు జోడించి 554 పరుగుల వద్ద ఆలౌటైంది. చండీమాల్ 206 పరుగులతో అజేయంగా నిలువగా.. కరుణరత్నే (86), కుశాల్ మెండిస్ (85), ఏంజలో మాథ్యూస్ (52), కమిందు మెండిస్ (61)లు లంక భారీ స్కోర్ సాధించడంలో తమవంతు పాత్ర పోషించారు.ఆసీస్ బౌలర్లలో స్టార్క్ 4, స్వెప్సన్ 3, లయన్ 2, కమిన్స్ ఓ వికెట్ పడగొట్టారు. అంతకుముందు స్టీవ్ స్మిత్ (145 నాటౌట్), లబూషేన్ (104) శతకాలతో రాణించడంతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 364 పరుగులకు ఆలౌటైంది. లంక అరంగేట్రం బౌలర్ ప్రభాత్ జయసూర్య 6 వికెట్లతో ఆసీస్‌ను తిప్పేశాడు.

# ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుల్లో భాగంగా క్రికెట్ మ్యాచ్ నిర్వహణ..?

భారత దేశానికి స్వాతంత్రం వచ్చి 75 వసంతాలు పూర్తైన సందర్భంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ పేరిట కేంద్ర ప్రభుత్వం వేడుకలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సంబురాల్లో భాగంగా ఓ క్రికెట్ మ్యాచ్‌ను కూడా నిర్వహించాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తోంది. టీమిండియా, వరల్డ్ ఎలెవెన్ జట్ల మధ్య ఆగస్టు 22న ఈ మ్యాచ్ నిర్వహించాలని కేంద్రం యోచిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై కేంద్ర సాంస్కృతిక శాఖ బీసీసీఐతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ మ్యాచ్ ప్రతిపాదనను బీసీసీఐకి చెందిన ఓ కీలక అధికారి సైతం ధృవీకరించారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**